RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 140 | శనివారం, జూలై 6, 2024 | పేజీలు : 4

### ఆగస్టులో మోడీ ప్రభుత్వం కూలుతుంది: లాలూ ప్రసాద్ యాదవ్

పాట్నా: నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆగస్టు నాటికి కూలిపోగలదని, కనుక ముందస్తు ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆర్జేడి చీఫ్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం బలహీనంగా ఉందన్నారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపి పార్టీకి సొంత మెజార్టీ దక్కలేదన్నారు. ఎన్డీఏ కూటమి పక్షాల సహకారంతో మోడీ ప్రభుత్వం నెట్టుకొస్తోందన్నారు. లాలూ ప్రసాద్ ఇలా వ్యాఖ్యానించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.

### కెసిఆర్‌కు సీతక్క...

# లీగల్ నోటీసులు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు.



'ఇందిరమ్మ రాజ్యం, ఇసుక రాళ్ల రాజ్యం' అంటూ పార్టీ ట్విట్టర్ అధికారిక సైట్లో బిఆర్ఎస్ పోస్టులు పెట్టింది. దానిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సీతక్క.. బిఆర్ఎస్ అకౌంట్ కావడంతో దానికి బాధ్యుడిగా ఆ పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ కు లీగల్ నోటీసులు ఇచ్చారు. తన ప్రతిష్టకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో విష ప్రచారం చేయడంపై మండిపడ్డారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కెసిఆర్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు. ఇప్పటికే పవర్ కమిషన్ నోటీసులు పట్టించుకోని కెసిఆర్, సీతక్క లీగల్ నోటీసులకు స్పందిస్తారా? అన్నది కుతూహలం కలిగిస్తోంది.

# నేడు ప్రజాభవన్‌లో ఇరు రాష్ట్రాల సిఎంల భేటీ

హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి నేడు ప్రజాభవన్ వేదికగా సాయంత్రం 6 గంటలకు సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలోనే 10 అంశాల అజెండాగా వారు ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలో భాగంగా ఇరు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులతో పాటు ఎపి నుంచి ముగ్గురు మంత్రులు అనగాని సత్యప్రసాద్, బిసి జనార్ధన్‌రెడ్డి, కందుల దుర్గేష్‌లతో పాటు తెలంగాణ నుంచి నలుగురు మంత్రులు పాల్గొనే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. వీరితో పాటు ఎపి సిఎస్, తెలంగాణ సిఎస్‌లతో పాటు ఇరు రాష్ట్రాలకు చెందిన ఆర్థిక, ఇతర శాఖల కార్యదర్శులు పాల్గొననున్నారు. ఈ సిఎంల భేటీకి సంబంధించి ప్రగతిభవన్‌లో ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు చేశారు. విభజనకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలపై వీరిద్దరూ భేటీ కావటం ఇదే తొలిసారి. మార్చి నెలలో సిఎం చొరవతో ఢిల్లీలో ఎపి భవన్‌కు సంబంధించిన విభజన వివాదం పరిష్కారమైన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల ఆరో తేదీన భేటీ అవుదామన్న ప్రతిపాదనను ఎపి సిఎం చంద్రబాబునాయుడు ఇటీవల తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ముందుంచారు. దానికి అంగీకరించిన తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాభవన్ వేదికగా భేటీకి నేడు ముహూర్తం ఖరారు చేశారు.



# సిబిఐ కోర్టులో కవితకు చుక్కెదురు



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను ట్రయల్ కోర్టు పొడిగించింది. ఆమె జ్యుడీషియల్ రిమాండ్‌ను రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు జులై 18 వరకు పొడిగించింది. సిబిఐ కేసులో కవిత జ్యుడీషియల్ రిమాండ్ ఈరోజుతో ముగిసింది. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను కోర్టులో హాజరుపరిచారు. మద్యం పాలసీ కేసులో కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు.

ఈ కేసులో కవితను సిబిఐ ఏప్రిల్ 11న అరెస్ట్ చేసింది. అంతకుముందే, ఈడి ఆమెను అరెస్ట్ చేసింది. తీహార్ జైల్లో ఉన్న కవితను ప్రశ్నించిన సిబిఐ, ఆ తర్వాత అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈడితో పాటు సిబిఐ కేసులలో కవిత చాలాకాలంగా జైల్లో ఉన్నారు. ఆమె బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ కోర్టులో తిరస్కరణ ఎదురవుతోంది.

### కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై

# సిబిఐకి నోటీసులు

న్యూఢిల్లీ: లిక్కర్ పాలసీ కుంభకోణంతో ముడిపడిన అవినీతి కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సిబిఐఐరి ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నోటీసు జారీచేసింది.

ఈ కేసు తదుపరి విచారణను జులై 17వ తేదీకి జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ వాయిదా వేశారు. అరవింద్ కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ కేజ్రీవాల్ ఉగ్రవాది కాదని, ఆయన దేశం విడిచి పారిపోయే అవకాశం లేదని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) నమోదు చేసిన మనీ లాండరింగ్ కేసులో బెయిల్ వచ్చిన తర్వాత ఆయనను సిబిఐ అరెస్టు చేసిందని న్యాయవాది తెలిపారు.



## రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడిగా కేశవరావు



హైదరాబాద్ : మాజీ ఎంపీ కేశవరావుకు తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడిగా క్యాబినెట్ ర్యాంక్ ఇవ్వాలని అనుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేశవరావు రాజీనామా విషయంలో కాంగ్రెస్ పార్టీ అంతా కలిసి నిర్ణయం తీసుకున్నట్లు సిఎం చెప్పారు. ఢిల్లీ పర్యటలో భాగంగా ప్రధాని మోడీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం సిఎం ఢిల్లీలోని కేకే నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డికి కేశవరావు స్వాగతం పలికి ఇంట్లోకి ఆహ్వానించారు. ఇకపై కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి ఏది మంచో కేకే నిర్ణయం తీసుకుంటారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. ఆయన సలహా మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణలో ఒక పార్టీ అధికారంలోకి వచ్చాక పదేళ్లు పక్కా ఉంటుందని, రెండోసారి కూడా కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి, రీజనల్ రింగు రోడ్డుపై దృష్టి పెట్టామని, ఎటువంటి గందరగోళం లేకుండా 11 వేలకుపైగా టీచర్ల బదిలీలు చేశామని అన్నారు.

# లోక్‌సభ ఎంపిగా ప్రమాణం చేసిన అమృత్‌పాల్ సింగ్

న్యూఢిల్లీ : జైలు నిర్బంధితులైన, పెరోల్ మంజూరైన రాడికల్ సిక్కు మత బోధకుడు అమృత్‌పాల్ సింగ్, కాశ్మీరీ నాయకుడు షేక్ అబ్దుల్ రషీద్ శుక్రవారం లోక్‌సభలో ఎంపిలుగా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయడానికి పెరోల్ మంజూరైన ఆ ఇద్దరూ పార్లమెంట్ సముదాయంలోను, పరిసరాల్లోను భారీ భద్రత బందోబస్తు నడుమ ఎంపిలుగా ప్రమాణ స్వీకారంచేశారు. ఇంజనీర్ రషీద్‌గా పేర్కొంటున్న రషీద్ యుఎపిఎ కింద నమోదైన ఉగ్ర నిధుల కేసులో ఢిల్లీ తీహార్ జైలులోను, అమృత్‌పాల్ సింగ్ జాతీయ భద్రత చట్టంకింద నేరాలకు అస్సాం దిబ్రూగఢ్ జిల్లాలో జైలులో నిర్బంధంలో ఉన్నారు. వారిని భద్రత సిబ్బంది శుక్రవారం ఉదయం పార్లమెంట్ సముదాయానికి తీసుకువచ్చారు. ఎంపిలుగా ఎన్నికైన ఆ ఇద్దరూ లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం లోక్‌సభ స్పీకర్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేసినట్లు ఒక ప్రతినిధి తెలిపారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 31 ఏళ్ల అమృత్‌పాల్ సింగ్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ నుంచి, 56 ఏళ్ల ఇంజనీర్ రషీద్ జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లా నుంచి ఇండిపెండెంట్లుగా ఎన్నికయ్యారు. వారు ఇతర విజేత అభ్యర్థులతో పాటు జూన్ 24, 25 తేదీల్లో 18వ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. ప్రమాణ స్వీకారం నిమిత్తం రషీద్‌కు తీహార్ నుంచి పార్లమెంట్ వరకు ప్రయాణ సమయాన్ని మినహాయించి రెండు గంటల కస్టడీ పెరోల్ మంజూరైంది.



# హత్రాస్‌లో బాధితుల బంధువులను పరామర్శించిన రాహుల్ గాంధీ

హత్రాస్, అలీగఢ్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ శుక్రవారం హత్రాస్‌ను సందర్శించి, తొక్కిసలాట మృతుల కుటుంబాలను పరామర్శించారు. మతపరమైన కార్యక్రమానికి తగిన పోలీసు ఏర్పాట్లు చేయలేదని, ఇదే తొక్కిసలాటకు దారితీసిందని మృతుల బంధువులు చెప్పారని ఆయన తెలిపారు. ఈ విషాదాన్ని రాజకీయం చేయదలచుకోలేదని రాహుల్ గాంధీ అన్నారు. కాగా మృతుల కుటుంబాలకు మరింత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. "ఇది బాధాకరమైన సంఘటన. చాలా మంది మరణించారు. నేను ఈ విషయాన్ని రాజకీయ కోణం నుండి చెప్పదలచుకోలేదు, కానీ పరిపాలనలో లోపాలు ఉన్నాయి, ముఖ్యమైన విషయం ఏమిటంటే... వారు పేదవారు కాబట్టి గరిష్ట పరిహారం ఇవ్వాలి. నష్టపరిహారం విషయంలో జాప్యం జరిగితే ఎవరికీ ప్రయోజనం ఉండదని యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్‌ని కోరుతున్నాను వారు షాక్‌లో ఉన్నారు, నేను వారి పరిస్థితిని అర్థం చేసుకోవాలనుకున్నాను..." అని రాహుల్ గాంధీ సమావేశం అనంతరం తెలిపారు.



# నన్ను క్షమించండి...

## ఓటమిని అంగీకరించిన రిషి సునాక్

**ఇంగ్లండ్:** బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతున్నది. ఎగ్జిట్‌పోల్స్‌ను నిజం చేస్తూ 14 ఏండ్లపాటు అధికారం చెలాయించిన కన్జర్వేటివ్ పార్టీకి ఓటమి ఖరారైంది. కీర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ఘన విజయం దిశగా దూసుకెళ్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై భారత సంతతికి చెందిన ప్రధాని రిషి సునాక్ స్పందించారు. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారు. ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో తన మద్దతుదారులను ఉద్దేశించి సునాక్ ప్రసంగించారు. 'బ్రిటన్ ప్రజలు నిర్ణయాత్మకమైన తీర్పును ఇచ్చారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ విజయం సాధించింది. ఆ పార్టీ నేత కీర్ స్టార్మర్‌కు అభినందనలు తెలియజేస్తున్నా. అధికారం శాంతియుతంగా చేతులు మారుతుంది. అది మన దేశ భవిష్యత్తు, స్థిరత్వంపై అందరికీ విశ్వాసం కలిగిస్తుంది. ప్రజల తీర్పును గౌరవిస్తూ.. ఓటమికి బాధ్యత వహిస్తున్నా. ఈ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు క్షమాపణలు కోరుతున్నా' అని సునాక్ తెలిపారు.



## సంపాదకీయం

### 'ఎమర్జెన్సీ' దాడి

# ఇంకెన్నాళ్లు?

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ప్రధాని మోడీ 50ఏళ్ల క్రితం నాటి ఎమర్జెన్సీ పరిస్థితిని గుర్తుకు తెస్తూ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది మాయని మచ్చగా పరోక్షంగా కాంగ్రెస్‌ను దృష్టిలో పెట్టుకుని ధ్వజమెత్తారు. అంతటితో ఆగలేదు. స్పీకర్, రాష్ట్రపతి నోట 'ఎమర్జెన్సీ' ప్రస్తావనే పార్లమెంట్ ఉభయ సభల్లోనూ తీసుకొచ్చారు. విపక్షనేతగా మొదటిసారి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనేక అంశాలు సభ ముందు లేవనెత్తారు. మణిపూర్ రావణ కాష్ఠంలా రగులుతున్నా ప్రధాని మోడీ కానీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కానీ ఒక్కసారీ మణిపూర్‌ను ఎందుకు సందర్శించ లేదు అని ప్రశ్నించారు. హిందూమతం అంటే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కాదని గుర్తు చేశారు. అగ్నిపథ్ పథకం ప్రవేశపెట్టి యువత భవిష్యత్ అయోమయం చేశారని నిలదీశారు. నోట్ల రద్దు నుంచి పౌరసత్వ సవరణ చట్టంవరకు ఎన్నో సమస్యలను రాహుల్ నిక్కచ్చిగా సభ ముందుంచినా వీటిలో ఏఒక్కదానికి మోడీ సర్కారు నుంచి సమాధానం రాకపోవడం గమనార్హం. ఎమర్జెన్సీని పదేపదే తిట్టిపోసే ప్రధాని నరేంద్ర మోడీ తన హయాంలో అంతకు మించి దురహంకార, దౌర్జన్యాలతో ప్రజల హక్కులను అణగదొక్కుతున్నారన్న విమర్శలు కొట్టి పారేయలేం. గురివిందగింజ తన నలుపెరగనట్టు తన పాలనలో ఎంత అరాచకం జరుగుతోందో మోడీ గమనించడం లేదు. ప్రజాస్వామ్యాన్ని బలిపీఠంపై పెట్టి ప్రజల హక్కులను హరిస్తున్నారనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ప్రజలకు వాస్తవ సమాచారం అందకుండా చేయడంలో మోడీ సర్కారు అందవేసిన చెయ్యిగా మేధావులు చెబుతున్నారు. ముఖ్యంగా తనకు వ్యతిరేకంగా ఉండే అభిప్రాయాలు, విశ్లేషణలు వార్తలకు ఎక్కనీయడం లేదు. సామాజిక మాధ్యమాల్లో పెట్టే పోస్టింగ్‌లను పరిశీలించి వాటిలో ఏదైనా నకిలీ లేదా అబద్ధపు వార్త (ఫేక్ న్యూస్)గా గుర్తించి దానిని తొలగించే పనిని కేంద్ర ప్రభుత్వం అధీనంలోని పిఐబి (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో)కి దఖలు పర్చడం ఎంతవరకు న్యాయం? ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సమాచార సాంకేతిక విభాగం నిబంధనలను మార్చడానికి కూడా సిద్ధమైంది. ఇది ఆనాటి ఎమర్జెన్సీకి ఏ విధంగా విరుద్ధమైనదో, భిన్నమైనదో ఎవరైనా ఎలా చెప్పగలరు? ఎమర్జెన్సీ సమయంలో పత్రికల్లో వార్తలపై నియంత్రణ కత్తెర వేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా అదే విధంగా మోడీ తమకు వ్యతిరేకంగా వచ్చిన వార్తలపై కత్తెర వేయడానికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోను వినియోగించుకోడానికి ప్రయత్నించడం పరోక్షంగా ఎమర్జెన్సీయే కదా! అలాగే దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛను మేం కల్పించామని మోడీ రాజ్యసభలో బుధవారం గొప్పగా చాటుకున్నారు. అంటే దర్యాప్తు సంస్థలు విపక్షనేతలపై గురిపెట్టి కేసులు బనాయించడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమేనా? ఎన్ఐఎ (జాతీయ దర్యాప్తు సంస్థ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసుల సంగతి అందరికీ తెలిసిందే. సుప్రీం ధర్మాసనం ఎన్నో సార్లు ఈ దర్యాప్తు సంస్థల కేసుల డొల్లతనం ఎండగట్టిన సంగతి కూడా తెలిసిందే. కేవలం ప్రతిపక్షాలను బోనుకెక్కించడానికే ఈ దర్యాప్తు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి తప్ప అధికార బిజెపి నేతలు ఎవరిపైనా కేసులు దాఖలు కాకపోవడం ఆక్షేపణలకు దారి తీస్తోంది. ఇటీవల పార్లమెంట్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపి ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న అవినీతి కేసుల సంగతేమిటి? అన్ని ప్రశ్నించడం ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. ఎన్‌డిఎ కూటమిలో చంద్రబాబు భాగస్వామి కావడం కేసుల నుంచి ఆయనకు రక్షణ కలిగించిందా? అన్న ప్రశ్న తలెత్తక మానదు. 17 వ లోక్‌సభలో ప్రతిపక్షాలను నోరెత్తనీయకుండా మోడీ సర్కారు ఏ విధంగా వ్యవహరించిందో తెలిసిందే. పౌరసత్వం సవరణ చట్టం, క్రిమినల్ కొత్త చట్టాలు, వ్యవసాయ చట్టాలు గురించి సభలో చర్చించాల్సిందేనని ఆనాడు పార్లమెంటులో ప్రతిపక్షాలు అరిచిగీపెట్టినా పాలకపక్షం ఆలకించలేదు. సరికదా దాదాపు 140 మంది ప్రతిపక్ష ఎంపిలను సభ నుంచి సస్పెన్షన్ చేయించింది. ఆనాడు చర్చకు నోచుకోని చట్టాలను బలవంతంగా ఇప్పుడు అమలులోకి తీసుకురావడం బుల్డోజ్ పాలన కిందకు రాదా? ఇదెంత వరకు ప్రజాస్వామ్య సంప్రదాయం? ఎమర్జెన్సీ బూచిని చూపించి కాంగ్రెస్‌పై పదేపదే ఎదురు దాడి చేస్తున్న ప్రధాని మోడీ ఇప్పుడు కూడా తానెంతవరకు ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని గౌరవిస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవడం లేదు. 400 స్థానాలు సాధిస్తామని, కాంగ్రెస్ నుంచి భారత్‌కు ముక్తి కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన మోడీ ఎన్నికల ఫలితాల నుంచి గుణపాఠం నేర్చుకున్నట్టు కనిపించడం లేదు. చీటికీ మాటికీ రాహుల్‌వి పిల్లచేష్టలని ఎద్దేవా చేసినంత మాత్రాన దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలకు పరిష్కారం లభించదు.


## మరమ్మత్తుల కారణంగా ఐదు రోజులపాటు పలుమార్లు విద్యుత్ అంతరాయం



**శామీర్ పేట, (గరుడ వార్త):** ఐదు రోజులపాటు పలుమార్లు విద్యుత్ అంతరాయం ఉంటుందని మేడ్చల్ డి ఈ పి. శ్రీనాథ్ రెడ్డి, శామీర్ పేట ఏ డి ఈ రమణారెడ్డి, ఏఈ సురేందర్, అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేట పరిధిలోని 132/33 కె.వి సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా ఈ నెల 5 నుంచి10వ తేదీ వరకు పలుమార్లు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. 50 ఎం వి ఏ ట్రాన్స్ఫార్మర్ను తొలగించి ఆ స్థానంలో సుమారు రూ. 6 కోట్ల విలువైన 80 ఎం వి ఏ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ కారణంగా తుర్కపల్లి జీనం వ్యాలీ పరిశ్రమల ఏరియా, శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలం, మేడ్చల్ మండలం పరిధిలోని గృహ వినియోగదారులు, వివిధ దుకాణం దారులు, పరిశ్రమల వారికి ఈ ఐదు రోజులపాటు పలుమార్లు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగాలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని వారు కోరారు. రమణారెడ్డి, ఏఈ సురేందర్, అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేట పరిధిలోని 132/33 కె.వి సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా ఈ నెల 5 నుంచి10వ తేదీ వరకు పలుమార్లు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. 50 ఎం వి ఏ ట్రాన్స్ఫార్మర్ను తొలగించి ఆ స్థానంలో సుమారు రూ. 6 కోట్ల విలువైన 80 ఎం వి ఏ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ కారణంగా తుర్కపల్లి జీనం వ్యాలీ పరిశ్రమల ఏరియా, శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలం, మేడ్చల్ మండలం పరిధిలోని గృహ వినియోగదారులు, వివిధ దుకాణం దారులు, పరిశ్రమల వారికి ఈ ఐదు రోజులపాటు పలుమార్లు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగాలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

## ఘనంగా మాస శివరాత్రి ప్రత్యేక పూజలు...





**శామీర్ పేట, (గరుడ వార్త) :** ఘనంగా మాస శివరాత్రి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గురువారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురలీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. తూముకుంట, శామీర్ పేటకు చెందిన భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహిం చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

### - విద్యా.. వైద్యం.. వ్యవసాయం వ్యవసాయ ఆధారిత రంగాలకు అధిక ప్రాధాన్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోనే హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డిఓ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు మిక్కిలినేని మను చౌదరి, పమేలా సత్పతి, ప్రావీణ్యతో పాటు అదనపు కలెక్టర్లు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మిషన్ భగీరథ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి పంచాయత్ రాజ్, గిరిజన సంక్షేమం, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయం, విద్యుత్తు, డిఆర్డిఏ తో పాటు పలు శాఖలపై మంత్రి సుదీర్ఘంగా ఐదు గంటల పాటు చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సర్పంచులు ఎంపిటీసీలు, ఎంపీపీలు, జడ్పిటిసిల పదవీకాలం పూర్తయినందున అధికారులే ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు పడకుండా శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న చేనేత, వ్యవసాయ ఆధారిత రంగాలతో పాటు పలు పథకాలను రైతులు పేద వర్గాలకు అందేలా చొరవ చూపాలని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో రోడ్ల పరిస్థితి తాగునీటి వ్యవస్థ, ఇరిగేషన్ ప్రాజెక్టుల స్థితిగతులపై అధికారులంతా ఒక రూట్ మ్యాప్ తయారుచేయాలని ఆదేశించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో గిరిజనులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కుటీర పరిశ్రమల కల్పనకు కృషి చేస్తానని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూముల వివరాలను సేకరించి ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. హుస్నాబాద్ తో పాటు ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులు రూపొందించాలని, ఇందుకు నిధులు మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని పేర్కొన్నారు. ఆన్ గోయింగ్ వర్క్స్ కు సంబంధించిన పనులు వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. గౌరవెల్లి, దేవాదుల, ఎస్సారెస్పీ మిడ్ మానేర్ ప్రాజెక్టుల ద్వారా హుస్నాబాద్ రైతాంగానికి సాగునీరు అందేలా ప్రత్యేక కృషి చేస్తానని చెప్పారు. సాగునీటికి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తానని తెలిపారు. నియోజకవర్గంలో విద్యా, వైద్యం వ్యవసాయము, పాడిపంట, వ్యవసాయ ఆధారిత రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఇక్కడ పాల ఉత్పత్తి అధికంగా జరుగుతున్నదని, పశు సంపద పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు, నిరుద్యోగులు యువత స్వయం ఉపాధికి చేపలు, గొర్లు, మేకల పెంపకం తో పాటు డైరీ ఫామ్స్ ఏర్పాటుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హుస్నాబాద్ నుంచి చేపలు మేకలు, గొర్లు హైదరాబాద్ కు ఎగుమతి చేసేలా ప్రత్యేక దృష్టి సారిస్తానని మంత్రి పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంతం టూరిజం స్పాట్ కు అనుకూలంగా ఉందని తెలిపారు. ఈ మేరకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, ఎల్లమ్మ దేవాలయం, శనిగరం ప్రాజెక్టు, మహాసముద్రం, రాయికల్ జలపాతం సర్వాయిపేట, పీవీ నరసింహారావు స్వగ్రామం వంగర, కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయం పర్యటకంగా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హుస్నాబాద్ ను పర్యటకంగా అభివృద్ధి చేస్తే మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాలను అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అద్దె భవనాల్లో కాకుండా సొంత భవనాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటానని, కలెక్టర్లు ఈ విషయంలో చొరవ చూపాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువుల్లో పెద్ద ఎత్తున చేపల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. రోడ్ల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ అధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. స్వశక్తి సంఘాల బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటానని, నియోజక వర్గంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యుత్ సరఫరా లో ఎక్కడ ఎలాంటి అవాంతరాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. గౌరవెల్లి, దేవాదుల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన మేరకు ఆయకట్టుకు సాగునీరు అందించేలా సత్వరమే అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు వైద్య పరంగా సహాయం అందించేందుకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇందుకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేశానని చెప్పారు. అధికంగా కిడ్నీలు ఫెయిల్ అయి డయాలసిస్ కి వెళ్తున్నారని, దీనిపై ప్రభుత్వం ఒక సర్వే నిర్వహిస్తున్నదని దానికి పరిష్కారం మార్గం కనుక్కుంటామని తెలిపారు. విదేశీ విద్యా విధానంలో భాగంగా విదేశాలకు వెళ్లే యువతకు ఉద్యోగాల అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ కలెక్టర్లు మిక్కిలినేని మను చౌదరి, పమేలా సత్పతి, ప్రావీణ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, ప్రఫుల్ దేశాయ్, రాధిక గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మి కిరణ్ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి, డివిజనల్ స్థాయి, నియోజకవర్గంలోని మండలాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు**

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు కేంద్రాలను పర్యటకంగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటామని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంతోపాటు వివిధ ప్రాంతాలను పర్యటకంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అలాగే గౌరవెల్లి దేవాదుల ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా రైతాంగానికి సాగునీటి అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ శాఖల ద్వారా పెండింగ్ లో ఉన్న నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి పున్నం ప్రభాకర్ సూచనల మేరకు నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు. ల్యాండ్ బ్యాంకింగ్ ఏర్పాటు చేస్తాం. ప్రాజెక్టుల భూ సేకరణ సత్వరమే పూర్తి చేస్తాం. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి. చిగురుమామిడి సైదాపూర్ మండలాల్లో ప్రభుత్వ భూముల వివరాలు సేకరించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సర్వాయిపేట, రాయికల్ జలపాతం టూరిజం స్పాట్ గా మార్చేందుకు డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేస్తామని తెలిపారు. రైతు వేదికల ద్వారా రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు శివశక్తి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు**

**- సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి .**

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు పెండింగ్ పనులను సత్వరమే పూర్తయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ రోడ్లకు సంబంధించిన రూట్ మ్యాప్ ను తయారు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల వివరాలతో ల్యాండ్ బ్యాంకు తయారుచేసి భూములు కబ్జా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో చర్చించిన అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతామని పేర్కొన్నారు.

## మరో వివాదంలో చిక్కుకున్న టాస్క్ ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావు

**హైదరాబాద్:** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో ఉన్న టాస్క్ ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావు మరో వివాదంలో చిక్కుకున్నారు. తాజాగా పీటీ వారెంట్ పై పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఓ ల్యాండ్ వ్యవహారంలో వ్యాపారవేత్తను బెదిరించినందుకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. కంపెనీ వ్యవహారంలో రాధాకిషన్ రావు జోక్యం చేసుకుని సెటిల్మెంట్ చేశారని, రూ. 150 కోట్ల కంపెనీని తక్కువ ధరకే మరొకరికి ఇప్పించారని రాధాకిషన్ రావు పై ఓ వ్యాపారవేత్త ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఇవాళ పీటీ వారెంట్ కింద అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టులో హాజరు పరిచి అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ చేసి క్రియా హెల్త్ కేర్ సంస్థలో రూ.కోట్ల విలువైన తన షేర్లను నలుగురు డైరెక్టర్ల మీదకు బలవంతంగా బదిలీ చేయించారని ఆ సంస్థ వ్యవస్థాపకుడు చెన్నుపాటి వేణుమాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఈ ఏడాది ఏప్రిల్‌లో కేసు నమోదు చేశారు. రాధాకిషన్ రావుతో పాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సహా చంద్రశేఖర్ వేగె, కృష్ణ, గోపాల్, రాజ్, రవి, బాలాజీలపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుల కోసం జూబ్లీహిల్స్ పోలీసులు లుక్ అవుట్ నోటీస్ జారీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన చెన్నుపాటి వేణుమాధవ్ హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేసి, ప్రపంచ బ్యాంకులో పని చేశారు. భారత్‌కు తిరిగొచ్చి 2011లో క్రియా హెల్త్ కేర్ సంస్థను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఖమ్మం జిల్లాలో టెలీ మెడిసిన్, జాతీయ రహదారి అత్యవసర వాహనాల సేవలు అందించే ఈ సంస్థ మొత్తం దాదాపు రూ.250 కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టింది. ఈ సంస్థలో ఇద్దరు శాశ్వత డైరెక్టర్లు వేణు, బాలాజీ, నలుగురు తాత్కాలిక డైరెక్టర్లుగా గోపాల్, రాజ్, నవీన్, రవి ఉన్నారు. సంస్థకు బాలాజీ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. 2016-17 నాటికి సంస్థలో వేణు -60, బాలాజీ -20, గోపాల్- 10, రాజ్ -10 శాతం చొప్పున వాటాలతో షేర్ హోల్డర్లుగా ఉన్నారు. 2018లో నలుగురు తాత్కాలిక డైరెక్టర్లు గోపాల్, రాజ్, నవీన్, రవి కలిసి వేణు పేరిట ఉన్న 60 శాతం షేర్లను తక్కువ ధరకు విక్రయించాలని, సంస్థను పూర్తిగా తామే నడిపించుకుంటామని ఒత్తిడి చేశారు. ఇదే సమయంలో గోల్డ్‌ఫ్ అబోడే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో చంద్రశేఖర్ వేగె పరిచయమవ్వగా, తాత్కాలిక డైరెక్టర్లు షేర్లు విక్రయించాలంటూ ఒత్తిడి తెస్తున్న విషయాన్ని వేణు అతనితో ప్రస్తావించారు. క్రియా సంస్థలో తాను షేర్ హోల్డర్‌గా మారితే నలుగురు తాత్కాలిక డైరెక్టర్లతో బేరసారాలు నడిపేందుకు అవకాశం ఉంటుందని చంద్రశేఖర్ వేగె వేణుకు చెప్పాడు. ఇందుకు అంగీకరించిన వేణుమాధవ్, మొత్తం రూ.40 కోట్ల విలువ చేసే 4 లక్షల షేర్లను చంద్రశేఖర్ పేరిట బదిలీ చేశాడు. ఆ తర్వాత చంద్రశేఖర్ ప్లేటు ఫిరాయించి తాత్కాలిక డైరెక్టర్లతోనూ ఇదే తరహాలో ఒప్పందం చేసుకున్నట్లు ఫిర్యాదులో వేణుమాధవ్ పేర్కొన్నారు. నలుగురు తాత్కాలిక డైరెక్టర్ల వేధింపులు ఎక్కువవడంతో 2018 అక్టోబరు 3న బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని వేణుమాధవ్ పేర్కొన్నారు. కొన్ని రోజుల తర్వాత షేర్లు బదలాయించడం లేదని ఆరోపిస్తూ అక్టోబర్‌లో తాత్కాలిక డైరెక్టర్లు కూడా అతనిపై ఫిర్యాదు చేశారు. తొలుత తాను ఇచ్చిన ఫిర్యాదు పట్టించుకోకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. ఆ తర్వాత చంద్రశేఖర్, గోపాల్, రాజ్, నవీన్, రవి తదితరులు అప్పటి టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌తో కలిసి బలవంతంగా షేర్లు బదిలీ చేయించుకోవాలని పథకం వేశారని ఆయన ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2018 నవంబరు 22న ఉదయం ఖాజాగూడ దగ్గర ద్విచక్రవాహనాలపై వచ్చిన ముగ్గురు అడ్డగించి తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని దాడి చేస్తూ బలవంతంగా టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లారని, ఎస్ఐ మల్లికార్జున్ వేణును ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లు కార్యాలయంలో ఉంచారని తెలిపారు. అప్పటికే చంద్రశేఖర్, గోపాల్, రాజశేఖర్, కృష్ణ, పూర్ణ చందర్‌రావు, బాలాజీ అక్కడికి చేరుకున్నారని, రూ.100 కోట్ల విలువైన కంపెనీ వాటాను చట్టవిరుద్ధంగా బదిలీ చేయాలని బెదిరించడం దారుణమని వారికి చెప్పానన్నారు. గట్టుమల్లు ఆదేశాలతో ఎస్ఐ మల్లికార్జున్ నకిలీ కరెన్సీ కేసులో తీసుకొచ్చిన నిందితుల్ని చితకబాది, తాము చెప్పినట్లు వినకపోతే ఇదే పరిస్థితి తనకూ వస్తుందంటూ బెదిరించారని పేర్కొన్నారు. డిసిపి రాధాకిషన్ రావు వచ్చాక చంద్రశేఖర్ వేగె జోక్యం చేసుకుని డిసిపి చెప్పినట్లు విని డీల్ ముగించాలని సూచించాడని, డీల్‌కు అంగీకరించాలని, ఇంకా ప్రాణాలతో ఉన్నందుకు అదృష్టవంతుడివంటూ తాత్కాలిక డైరెక్టర్లు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే సమయంలో తన లాయర్ శ్రీనివాస్, స్నేహితుడైన లహరి రిసార్ట్స్ యజమాని సంజయ్‌కి కిడ్నాప్ చేసినట్లు సమాచారమిచ్చాడని తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా - మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి

**కోరుట్ల:** సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. పట్టణంలోని16 వార్డులో శుక్రవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మ రాజారెడ్డిలతో కలిసి వార్డు సందర్శన చేశారు. ఈ సందర్భంగా వార్డులోని పలుప్రాంతాలలో సిసి రోడ్డు, మురికి కాలువలు, కల్వర్ల, ర్యాంపుల నిర్మాణాల కోసం నిధులు కేటాయించమని కమిషనర్ ను కోరారు. అదేవిధంగా వర్షాకాలం సందర్భంగా మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ,నీరు నిలువ లేకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వం నుండి నిధులు తెప్పించి అవసరమున్న చోట సిసి రోడ్లు, మురికి కాలువలు, కల్వట్ల, ర్యాంపులు నిర్మాణం త్వరలోనే చేపట్టుతామని హామీ ఇచ్చారు. వార్డులో ప్రజలు చెత్తను మురికి కాలువల్లో, రోడ్లపై వేయకూడదని కోరారు. చెత్త బండికి తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని ప్రజలను కోరారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

=====================

## తొమ్మిది మందిని బలి తీసుకున్న బావి

**కోర్బా:** కోర్బాజిల్లా జాంజ్ గిర్ ఘటన తరహాలోనే కోర్బా జిల్లాలో కూడా బావిలో పడి నలుగురు మృతి చెందిన ఘటన తాజాగా చోటు చేసుకుంది. కోర్బా జిల్లా కట్ఘోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని జురాలి గ్రామంలో బావిలో పడి నలుగురు మృత్యువాత పడ్డారు. తండ్రి బావిలో పడిపోగా కాపాడేందుకు దిగిన కూతురు కూడా బయటికి రాకపోవడంతో వారిని కాపాడేందుకు మరో ఇద్దరు బావిలోకి దిగి మృత్యువాత పడ్డారు. నీరులేని పాత బావిలో విషవాయువులు పేరుకుపోయి ప్రాణవాయువు లభించకపోవడమే ప్రమాదానికి కారణమని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఛత్తీస్-ఘడ్ లో బావిలో పడి మృతి చెందిన వారి సంఖ్య మొత్తం 9కి చేరింది.

=====================

## అధికారులు రైతాంగ శ్రేయస్సుకోసం పనిచేయాలి - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం మండలం పడాల మార్కెట్ యార్డ్ ను శుక్రవారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారులు రైతాంగ శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మార్కెట్ యార్డ్ ను ఆకస్మికంగా తనిఖీ చేస్తా అని ఏమైనా తేడాలు ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. అవినీతి పాల్పడితే ఊరుకోమని హెచ్చరించారు. రైతాంగానికి మేలైన సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మార్కెట్ యార్డ్ లో ఏడాదికి రెండు కోట్ల అనుసంధాన రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఐదేళ్లలోరూ. 10 కోట్లతో లింక్ రోడ్లు నిర్మిస్తామన్నారు. అవసరమైతే సీఎం చంద్రబాబు నాయుడును మరిన్ని నిధులు కోర్తామన్నారు. ఆయన వెంట ఏఎంసీ గ్రేడ్-1 కార్యదర్శి ఎం ఎన్ వి ప్రభాకర్, ఉమ్మడి నాయకులు ఉన్నారు.

==========================

## దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయండి - సిద్ధరామయ్యకు ఎడియూరప్ప సవాలు

**బెంగళూరు:** కర్నాటక అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు బిజెపి అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి బిఎస్ ఎడియూరప్ప సవాలు విసిరారు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే బిజెపి 140 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.గురువారం బిజెపి రాష్ట్ర ప్రత్యేక కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ కర్నాటక ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నిరుపయోగ హామీలు, ధన బలం, కండబలాన్ని వ్యతిరేకించారని, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని గెలిపించారని చెప్పారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని, అప్పుడే మీ పరిస్థితి ఏమిటో మీకు తెలుస్తుందని ఎడియూరప్ప అన్నారు. కర్నాటక అసెంబ్లీ సంఖ్యబలం 224 కాగా లోక్‌సభ స్థానాల సంఖ్య 28. లోక్‌సభ ఎన్నికలలో బిజెపి-జెడిఎస్ కూటమి 19 సీట్లు గెలుచుకుందని, 142 అసెంబ్లీ సెగ్మెంట్లలో బిజెపి మెజారిటీ సాధించిందని ఎడియూరప్ప తెలిపారు.కేవలం ఏడాది క్రితం 134 స్థానాలు గెలుచుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, పలువురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో కాంగ్రెస్ వెనుకబడి పోయిందని ఆయన తెలిపారు. ఏడాదిలోనే కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రజాదరణ కోల్పోయిందనడానికి ఇదే నిదర్శనమని ఆయన చెప్పారు. అవినీతికి పాల్పడుతూ, ప్రజాశ్రేయస్సును విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని ఆయన చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ ధన, భుజబలాన్ని పట్టించుకోకుండా ప్రధాని నరేంద్ర మోడీపై విశ్వాసాన్ని చూపారని ఆయన చెప్పారు.

==========================

## విద్యార్థుల అరెస్టును ఖండించిన ఎర్రోళ్ల శ్రీనివాస్

**హైదరాబాద్:** నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టుని బి.ఆర్.ఎస్ పార్టీ అధికార ప్రతినిధి డా. ఎర్రోళ్ల శ్రీనివాస్ ఖండించారు. కాంగ్రెస్ పార్టీ గత ఏడు నెలలుగా నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదు. వారి సమస్యలను వినడానికి ఒక్క మంత్రి, అధికారి అందుబాటులో వారితో చర్చలు జరపకపోవడం సిగ్గుచేటు. ఇది ప్రజా పాలన కాదు నిర్బంధ పాలన. పోలీసులు రాత్రి నుండే అమ్మాయిలని కూడా చూడకుండా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు అనేక ఆశలు కల్పించి ఎన్నికల్లో వారిని వాడుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని రొడ్డుకీడ్చింది కాంగ్రెస్. ఇప్పటికైనా వారితో చర్చలు జరిపి వారి యొక్క న్యాయపరమైన డిమాండ్లను, హామీలను నెరవేర్చాలి. సమస్యలు పరిష్కరించే దాక, డిమాండ్లు సాధించే దాకా వదిలిపెట్టం. విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున గొంతెత్తుతామని అన్నారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగుల అరెస్టులను తక్షణం నిలిపివేసి, అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# సేవానిరతికి ప్రతిరూపం కంచర్ల సుగుణమణి...




భారతదేశ చరిత్రలో మహిళా నేతలు పోషించిన పాత్ర విశిష్టమైనది. సంఘ సేవ చేసేవారు ఎంతో మంది ఉండవచ్చు. కాని సంఘ సేవే పరమావధి గా తమ జీవితాలను అంకితం చేసే వారు బహు అరుదుగా వుంటారు. ఆలాంటి త్యాగ మూర్తులలో అగ్ర భాగాన నిలుస్తారు కంచర్ల సుగుణమణి. ఆమె ప్రముఖ సంఘ సేవకురాలు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ కు అసలు సిసలైన అనుచరురాలిగా ఆమె సుప్రసిద్ధురాలు. ఆమె 1919, నవంబర్ 27వ తేదీన కాకినాడలో గురుజు వెంకటస్వామి, సూర్యనారాయణమ్మ దంపతులకు జన్మించారు. ఆ రోజులలోనే ఈమె మగపిల్లలతో సమానంగా మహారాజా కాలేజీలో డిగ్రీ చదివారు. చిన్నప్పటినుండి మంచి వాతావరణంలో పెరగడంవల్ల ఆమెకు సేవాభావం అలవడింది. ఆమె వివాహం గాంధేయవాది కంచర్ల భూషణంతో జరిగింది. ఆ రోజుల్లోనే కట్నకానుకలు వద్దని, చదువు, సంస్కారం వున్న అమ్మాయి కావాలని కంచర్ల భూషణం ఆమెను వివాహం చేసుకున్నారు. ఆమె చదువుకునే రోజులలోనే భూకంపాలు, వరదలు, ఉప్పెనలు వచ్చినప్పుడు, ఇంటింటికీ వెళ్ళి విరాళాలు సేకరించి కాలేజీ యాజమాన్యానికి అప్పగించారు. తనలోని తపనను అక్షరాలతో పొదిగి గృహలక్ష్మి, భారతి వంటి పత్రికలకు వ్యాసాలు వ్రాసింది. స్త్రీ జనోద్ధరణ కోసం 1937లో లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే సంస్థ ప్రారంభించారు. భర్త ఉద్యోగరీత్యా ఈమె ఢిల్లీ వెళ్ళారు. ఆకాశవాణిలో ఆమె తొలి తెలుగు ప్రసంగం ఢిల్లీ నుండి ప్రసారమయింది. 1944 సంవత్సరంలో భర్తకు బదిలీ కావడంతో మద్రాసుకు మకాం మార్చారు. భర్త ప్రోత్సాహంతో, ఆమె దుర్గాబాయమ్మను సందర్శించి ఆమెతో పాటుగా సేవ చెయ్యాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. దుర్గాబాయమ్మ దానికంగీకరించి ఆమెకు "ఆంధ్రమహిళ" పత్రిక పూర్తి బాధ్యతను అప్పగించింది. మద్రాసులో ఆమెకు బులుసు సాంబమూర్తి, భోగరాజు పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు మొదలైన ప్రముఖుల సాంగత్యంతో ఆమె ఎన్నో విషయాలు తెలుసు కోగలిగారు. దుర్గాబాయమ్మ గారితో కలిసి "కస్తూరిబా నిధి"కి విరాళాలు ఒక సంవత్సరంలో 6 లక్షలు ప్రోగు చేశారు. ఆ రోజుల్లో 6 లక్షలంటే సామాన్యం కాదు. మహాత్మాగాంధి ఆజ్ఞ ప్రకారం దుర్గాబాయమ్మతో కలసి ఆ నిధితో ఆమె రాష్ట్రమంతా పర్యటించి, "కస్తూరిబా సేవా సంఘాలు" స్థాపించి అనుభవజ్ఞులైన సేవికలను ఏర్పాటు చేశారు. ఈనాటికీ అవి నిర్విరామంగా సేవలు చేస్తున్నాయంటే వాటి వెనుక ఆమె కృషి ఎంతో ఉంది. భర్త ఉద్యోగరీత్యా అరకు వెళ్ళినప్పుడు అక్కడి గిరిజనుల పూరిళ్ళు, ఆహారం, భాష, కట్టుబాట్లు విచిత్రంగా వుండటం ఆమె గమనించారు. అక్కడి అనారోగ్యాలూ, విష జ్వరాలూ, కొండదేవతలకిచ్చే నరబలులు, జంతు బలులూ చూసి చలించి పోయి, మద్రాసులోని స్త్రీ శిశు సంక్షేమ అధికారి పారిజాతం నాయుడికి లేఖ రాశారు. ఆమె సహకారంతో ఒక సంక్షేమ కేంద్రాన్ని స్థాపించి, తమ కాలనీలోని స్త్రీల సహకారంతో పిల్లలకు చదువు, ఆటపాటలు, కుట్లు, పారిశుధ్యం నేర్పుతూ సుగుణమణి ఐదు సంవత్సరాలు వారికి సేవ చేశారు. ఇప్పటికీ అక్కడ ఆ కేంద్రంలో స్త్రీలకు, పిల్లలకు చదువు, వృత్తివిద్యలు, ఆరోగ్య సూత్రాలు నేర్పుతున్నారు. 1944 నుంచీ ఆలిండియా రేడియోలోనూ, టి.వి. వచ్చిన తరువాత అన్ని ఛానల్స్‌లోను ఎన్నో స్త్రీల సమస్యల గురించి తన నిశ్చితాభిప్రాయాలను వెలిబుచ్చుతూనే ఉండేవారు. శిశువుల నుంచీ వృద్ధుల దాకా స్త్రీలను ఆదుకోవాలనే ఆశయంతో సుందర్ నగర్‌లో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. ఆమె దుర్గాబాయమ్మ కోరిక మేరకు 1957 అక్టోబరులో హైదరాబాదు వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. "ఆంధ్ర మహిళాసభ" హైదరాబాద్ శాఖను అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. అప్పుడు విద్యానగర్‌లో ప్రారంభించిన "ఆంధ్ర మహిళాసభ" మెటర్నిటీ హాస్పిటల్, హేండీక్రాఫ్ట్స్ ఇన్‌స్టిట్యూట్, హైస్కూల్, హాస్టల్, అసెంబ్లీహాల్ లతో నిండిపోతే, ఉస్మానియా యూనివర్సిటీలో కూడా స్థలం తీసుకుని ఆర్ట్స్, సైన్స్, లా కాలేజీలు, కంప్యూటర్ కోర్స్, సంగీతం క్లాసులు, లిటరసీ భవన్, గాంధీభవన్, హాస్టల్, వికలాంగుల స్కూలు, ఫిజియోథెరపీ, నర్సింగు హాస్టల్ అలా ఎన్నో ఏర్పాటు చేశారు. 260 మంది పిల్లలు ఎన్నో వృత్తి విద్యలు నేర్చుకుంటున్నారు. "ఆంధ్ర మహిళాసభ" పెట్టిన కొత్తలో దుర్గాబాయమ్మతో కలిసి ఆమె ఇంటింటికీ తిరిగి బేడా, పావలా కూడా విరాళాలుగా సేకరించింది. అలా మొదలైన సేవ మరణించే వరకూ లక్షలలో విరాళాలు సేకరిస్తూ "ఆంధ్రమహిళాసభ"ను శాఖోప శాఖలుగా విస్తరిస్తూ, కొన్ని శాఖలకు కార్యదర్శిగా, సలహాదారుగా సేవలు చేస్తూ, 6 ఏళ్ళు అధ్యక్షురాలిగా సమర్థ వంతంగా ఆ పదవిని నిర్వహించారు. దుర్గాబాయమ్మ మరణించాక 'ఆంధ్ర మహిళాసభ' పూర్తి బాధ్యతలను చేపట్టారు. ట్రస్ట్ బోర్డ్‌కి మరణించే వరకు తన సహాయ సహకారాలను అందించారు. ఆమె ఆధ్వర్యంలో దుర్గాబాయమ్మ సెంటినరీ సెలబ్రేషన్స్ చాలా ఘనంగా జరిగింది. మద్రాసు, హైదరాబాద్‌ల లోనే కాకుండా, కర్నూలు, సంగారెడ్డి, మహబూబ్ నగర్, ఇబ్రహీంపట్నం లలో కూడా ఆంధ్ర మహిళాసభ ఎంతో కృషి చేస్తున్నది. ఎడల్ట్ ఎడ్యుకేషన్ రూరల్ ఏరియాలలో లిటరసీ హౌస్ దక్షిణ భారతంలో "ఆంధ్ర మహిళాసభ"లో మాత్రమే వున్నది. వాలంటరీ సెక్టార్‌లో కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ ఇచ్చే మొదటి సంస్థ యిదే. ఇన్ని సంస్థలు దుర్గాబాయమ్మ తదనంతరం కూడా అంత ఘనంగానూ నడుస్తున్నా యంటే, అది ఆమె ఓర్పు, నేర్పు, సహనం, సమయపాలనల వల్లనే. "ఆంధ్ర మహిళ" పత్రిక పూర్తి బాధ్యత సుగుణమణి తీసుకున్నారు. అందులో కనుపర్తి వరలక్ష్మమ్మ, ఆచంట రుక్మిణమ్మ, కాంచనపల్లి కనకాంబ మొదలైన ఆనాటి ప్రముఖ రచయిత్రుల వ్యాసాలను ప్రచురించటమే కాదు, తనూ స్వయంగా వ్రాసి పత్రికను తీర్చిదిద్దారు. ప్రూఫులు దిద్దటం దగ్గరనుంచీ, స్టాంపులు అంటించి నడిచివెళ్ళి పోస్ట్ చెయ్యటం దాకా అన్ని బాధ్యతలూ ఈమే నిర్వర్తించే వారు. అటు 'ఆంధ్ర మహిళాసభ'లో స్త్రీ సంక్షేమంతో పాటుగా, యిటు 'బాలానంద సంఘం'లో శిశు బాలల సంక్షేమానికీ ఆమె అంకితమైనారు. 'బాలానంద సంఘం'లో మొదటి నుంచే ఉపాధ్యక్షురాలిగా ఆమె ఎంతో సేవ చేశారు. రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావు, అక్కయ్య న్యాయపతి కామేశ్వరి దంపతులకు ఆమె ఎంతో ఆత్మీయురాలు. న్యాయపతి రాఘవరావు చనిపోయి తరువాత 1984 నుండి ఆమె బాలానంద సంఘం అధ్యక్షురాలిగా పనిచేసింది. ఆమె ఆధ్వర్యంలో "ఆంధ్ర బాలానంద సంఘం" 1990 సంవత్సరంలో స్వర్ణోత్సవాలను దిగ్విజయంగా జరుపుకున్నది. ప్రజా జీవితంలో ఎన్నో పదవులు ఆమెను వరించాయి. ఆంధ్ర మహిళా సభ కార్యదర్శి/సలహాదారు/అధ్యక్షురాలుగా, ఆంధ్ర బాలానంద సంఘం ఉపాధ్యక్షురాలు/అధ్యక్షురాలుగా, మద్రాస్ రాష్ట్ర సొసైటీ అడ్వయిజరీ బోర్డు సభ్యురాలుగా, వికలాంగుల సలహాబోర్డు సభ్యురాలుగా, కస్తూర్బా గాంధీ సేవాసంఘం ఉమెన్ కమిటీ కార్యదర్శిగా, శారదా సంఘం ఆంధ్రప్రదేశ్ ఛైర్‌పర్సన్ గా, ఉమ్మడి ఏపీ కార్మిక సంక్షేమ సలహా కమిటీ సభ్యురాలుగా వివిధ పదవులు చేపట్టి సేవలు అందించారు. 1991లో: ఛైల్డ్ వెల్ఫేర్‌కి గాను నేషనల్ అవార్డు అప్పటి ప్రెసిడెంట్ చేతుల మీదుగా, 1991లో శిరోమణి ఇన్‌స్టిట్యూట్, న్యూఢిల్లీ వారి చేత వికాసశ్రీ అవార్డు 1993 లో భరతముని కళా అవార్డు, 1994లో రాజీవ్‌రత్న నేషనల్ అవార్డు, 2000లో మిలీనియమ్ అవార్డు, 200లో రామకృష్ణ మఠ్ ద్వారా లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు, 2001లో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా హైదరాబాద్ పెరల్ సిటీ జూనియర్ ఛాంబర్ వారిచే హైదరాబాద్ పెరల్ అవార్డు, 2002లో గాంధీగారి మనుమరాలు, తారాగాంధీ చటర్జీ ద్వారా సర్వోదయా సంస్థ అవార్డు, 2005లో రామినేని ఫౌండేషన్ విశేష పురస్కారం, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తమ సంఘసేవకురాలు పురస్కారం, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అవార్డు, ఇందిరా ప్రియదర్శిని ప్రతిభా అవార్డు తదితర పురస్కారాలు, సన్మానాలు పొందారు. ఆమె తన 99వ యేట 2017, జూలై 5వ తేదీ బుధవారం హైదరాబాదులో మరణించారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి రావూరి...


ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు.రావూరి భరద్వాజ (జూలై 5, 1927 – (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చుకున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపాడు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింప బడుతుంది. ఈయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన.తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు.

చిన్నతనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించు కున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరధ్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరధ్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకలనాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాదమైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు.విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం



చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది.

# బైడెన్ ఖచ్చితంగా అధ్యక్ష రేసు నుంచి తప్పుకోరు.....




అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నవంబర్‌లో జరగబోయే ఎన్నికల నుంచి తప్పుకుంటారని వార్తలు వస్తున్న నేపథ్యంలో తాజాగా దీనిపై వైట్‌హౌస్ ప్రతినిధి కరీన్ జీన్-పియర్ స్పందించారు. ఆయన ఈ వార్తలను పూర్తిగా కొట్టిపారేశారు. డెమొక్రాటిక్ అభ్యర్థిగా ఉపసంహరించుకునే ఉద్దేశ్యం బైడెన్‌కు "ఖచ్చితంగా" లేదని, ఆయన స్పష్టమైన దృష్టితో ఉన్నారు, అధ్యక్ష రేసు నుంచి తప్పుకోరని ఒక విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో బైడెన్ వయస్సు పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, మతిమరుపు కూడా వచ్చిందని కొంతమంది విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్- బైడెన్ మధ్య ఇటీవల జరిగిన ప్రత్యక్ష చర్చ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ చర్చలో మాట్లాడుతూ, బైడెన్ కొన్ని సార్లు తడబాటుకు గురయ్యారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు ఉన్న సమయంలో బైడెన్ తన ప్రత్యర్థిని ఎదుర్కోవడంలో ఇబ్బందులు పడటం డెమోక్రాటిక్ పార్టీలో తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఈ నేపథ్యంలో తదుపరి అధ్యక్ష ఎన్నికల్లో ఆయన రేసు నుంచి తప్పుకుని మరొకరికి అవకాశం ఇస్తారని, ముఖ్యంగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిచెల్ ఒబామా ట్రంప్‌కు బలమైన పోటీగా ఉంటారని నివేదికలు వచ్చాయి.

## తక్కువ బరువుతో శిశువులు



**న్యూఢిల్లీ :** కోవిడ్ -19 మహమ్మారి సమయంలో భారతదేశంలో తక్కువ బరువుతో జన్మించిన శిశువుల సంఖ్య బాగా పెరిగింది. సుమారు మూడు శాతం కంటే ఎక్కువ మంది పిల్లల జననం ఇలాగే జరిగిందని నూతన అధ్యయనంలో వెల్లడైంది. మహమ్మారి సమయంలో జన్మించిన పిల్లలు పుట్టినప్పుడు తక్కువ బరువు కలిగి ఉండే ప్రమాదం రెండింతలు ఉన్నట్టు ఈ అధ్యయనం కనుగొన్నది. తక్కువ బరువుతో జన్మించిన పిల్లల పెరుగుదల దీర్ఘకాలికంగా ప్రభావాన్ని చూపుతుందని అభివృద్ధి, గ్లోబల్ హెల్త్ ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ యూనివర్శిటీ ఆఫ్ నోట్రే డామ్ సంతోష్ కుమార్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు తక్కువ బరువుతో పుడుతున్నారు. దీనిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2.5 కిలోగ్రాముల కంటే తక్కువ అని నిర్వచించింది. కమ్యూ నికేషన్స్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం.. ఈ శిశువులలో 95 శాతం మంది తక్కువ, మధ్య-ఆదాయ దేశాలలో, సగం మంది దక్షిణాసియాలో జన్మిం చారు. ఈ అధ్యయనం ప్రకారం.. ఏప్రిల్ 2020- ఏప్రిల్ 2021 మధ్య జన్మించిన పిల్లలు మహమ్మారికి ముందు జన్మించిన వారితో పోలిస్తే డబ్ల్యూహెచ్ఓ నిర్వచించిన పరిమితి కంటే తక్కువ బరువు కలిగి ఉన్నారు. రెండు లక్షల మంది శిశువులను విశ్లేషించగా.. అందులో 12,000 మంది మహమ్మారి సమయంలో జన్మించారు. 1,92,000 మంది మహమ్మారికి ముందు జన్మించారు. 2019-2021లో నిర్వహించిన ఇండియన్ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) నుంచి సమాచారం సేకరించారు. సగటున, మహమ్మారి సంవత్సరాలలో జనన బరువులు 11 గ్రాములు తగ్గినట్టు కనుగొనబడింది.


## భారత్-చైనా సరిహద్దు సమస్యలపై చైనా విదేశాంగ మంత్రితో జైశంకర్ చర్చలు



భారత విదేశాంగ మంత్రి జైశంకర్ గురువారం కజకిస్థాన్‌లోని ఆస్తానాలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీని కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరు భారత్-చైనా సరిహద్దు సమస్యల గురించి చర్చించుకున్నారు. తూర్పు లడఖ్‌లో మిగిలిన సరిహద్దు సమస్యలను పరిష్కరించడానికి దౌత్య, సైనిక మార్గాల ద్వారా ప్రయత్నాలను రెట్టింపు చేయడానికి అంగీకరించారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ ఇరువురు నేతలు సమావేశమయ్యారు. వారిద్దరి భేటీకి సంబంధించిన ఫొటోలను జైశంకర్ సోషల్ మీడియా ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానిస్తూ, ఎల్ఓసీని గౌరవించడం, సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతను నిర్ధారించడం చాలా అవసరం. పరస్పర గౌరవం, సున్నితత్వం, ఆసక్తి రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు మార్గనిర్దేశం చేస్తాయని అన్నారు. చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై కన్సల్టేషన్, సమన్వయంపై వర్కింగ్ మెకానిజం ముందస్తు సమావేశం నిర్వహించాలని వారు అంగీకరించారు. ఈ భేటీలో ఎక్కువగా సరిహద్దు వివాదంపైనే చర్చలు సాగినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. గతంలో రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రోటోకాల్‌లకు పూర్తిగా కట్టుబడి ఉండటానికి ఇరు మంత్రులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే, ప్రపంచ పరిస్థితులపై అభిప్రాయాలను కూడా చర్చించారు. మే 2020లో గాల్వాన్‌లో జరిగిన ఘర్షణతో భారతదేశం, చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్న తర్వాత రెండు దేశాల విదేశాంగ మంత్రుల నుంచి ఈ విధమైన ప్రకటన రావడం గమనార్హం.

## వందే భారత్‌లో వర్షపు నీరు...

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వందే భారత్ హైస్పీడ్ రైల్‌లోని సౌకర్యాలపై తరచూ ఫిర్యాదు వస్తున్నాయి. టిక్కెట్ ధర ఎక్కువైనా అందుకు తగ్గట్లుగా సౌకర్యాలు ఉండటం లేదని ప్రయాణికుల నుంచి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. ఇటీవల కూడా ఇలాంటి సంఘటన జరిగింది. ఇటీవల కురిసిన వర్షం కారణంగా వందేభారత్ పైకప్పు నుంచి లోనికి నీరు చేరింది. న్యూఢిల్లీ నుంచి వారణాసికి బయలుదేరిన రైలులో ఈ ఘటన చోటు చేసుకొంది. వర్షం కారణంగా పైకప్పు నుంచి నీరు లోనికి చేరింది. సీట్లన్నీ తడిచిపోవడంతో ప్రయాణికులు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఏకధాటిగా నీరు పైనుంచి రావడంతో ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలిగింది. దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ప్రయాణికుడు రైల్వే సేవలపై తన అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోకు "వందేభారత్‌లో ఇప్పటివరకు క్యాటరింగ్ సమస్యే ఉండేది. ఇక నుంచి మరో కొత్త సమస్యను ఎదుర్కొవాలి" అని ఒకరు.. "ఇకపై ప్రయాణికులు తడుస్తూ ప్రయాణించవచ్చు. ధర ఎక్కువ సేవలు



తక్కువ" అని కామెంట్లు వస్తున్నాయి. ఈ ఘటనపై ఉత్తర రైల్వే స్పందించింది. నీరు లోనికి రావడానికి గల కారణాన్ని వివరించింది. "ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. నీటి పైపులు తాత్కాలికంగా మూసుకుపోవడంతోనే ఈ విధంగా జరిగింది. నీరు లోనికి చేరింది. ఇలాంటి తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్త పడతాం" అని ఓ ప్రకటనలో ప్రయాణికులను క్షమాపణలు కోరింది.

## భోలే బాబా పరార్!



హత్రాస్ : హత్రాస్ ఘటనలో మరణించిన వారి సంఖ్య 121కి పెరిగింది. మతపరమైన ప్రార్థనా కార్యక్రమాన్ని నిర్వహించిన నారాయణ్ సకాల్ హరి అలియాస్ భోలే బాబా పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా చేర్చకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సత్సంగ్ ముఖ్య నిర్వాహకుడు దేవ ప్రకాశ్ మధుకర్, ఇతర గుర్తు తెలియని నిర్వాహకులపై మాత్రమే కేసు నమోదైంది. ప్రార్థనా సమావేశానికి ఎనభై వేల మందికి అనుమతి ఇస్తే రెండున్నర లక్షల మంది వచ్చారని పోలీసులు తెలిపారు. భోలే బాబా ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఆయనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మొయిన్‌పురిలో భోలే బాబాకు చెందిన రామ్ కుటీర్ ఛారిటబుల్ ట్రస్టులో సోదాలు నిర్వహించామని, అక్కడ ఆయన కన్పించలేదని పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ అధికారులు ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను తీసుకొచ్చి పరిసరాలలో గాలించారు. తనను తాను గురువుగా చెప్పుకునే భోలే బాబా ఆశీస్సులు పొందేందుకు, ఆయన పాదధూళిని స్వీకరించి నుదుట రాసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో ఎగబడడంతో తొక్కిసలాట జరిగిందని అధికారుల ఆంతరంగిక నివేదిక చెబుతోంది.

## రాజ్యసభలోనూ మోడీ అదే పాట....!



**న్యూఢిల్లీ :** రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన అసత్య ప్రసంగాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని మోడీ రెండు గంటల పాటు సమాధానమిచ్చారు. లోక్‌సభలో మాదిరిగానే ఇక్కడ కూడా ప్రతిపక్షాలనే టార్గెట్‌గా చేసుకున్నారు. మణిపూర్ అంశంపైనా ఎదురు దాడి చేశారు. ప్రధాని అసత్య ప్రచారానికి దీనిని వేదికగా చేసుకున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రతిపక్షాల నిరసనల మధ్య ప్రధాని మోడీ ప్రసంగం కొనసాగింది. రాబోయే ఐదేళ్లలో పేదరికంపై పోరులో విజయం సాధిస్తామన్నారు. 140 కోట్ల మంది ప్రజలను ప్రతిపక్షాలు అవమానిస్తు న్నాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం వల్లే తనలాంటి వారు పార్లమెంట్ వరకు రాగలిగారని అన్నారు. . కాంగ్రెస్ హయాంలో రూ. 60,000 కోట్ల వరకు రైతుల రుణాలను మాఫీ చేసినా లబ్ధిదారుల జాబితాలో చిన్న, సన్నకారు రైతుల పేర్లు ఉండేవి కావని ఆరోపించారు. చర్చల్లో వారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంటే వినే ధైర్యం వారికి లేకపోయిందని ఎద్దేవా చేశారు. సభ ప్రారంభం కాగానే రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఎంపి హర్భజన్ సింగ్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

## నీట్ స్కాంపై నేడు విద్యాసంస్థల బంద్...




న్యూఢిల్లీ: నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజ్‌కు కేంద్ర బిందువు అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎన్‌టిఎ పనితీరు, నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ బుధవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఎన్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్ఎ, సమాజ్‌వాదీ ఛత్రి సభ, ఇతర విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ప్లకార్డులు చేబూని కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌టిఎకి, కేంద్ర విద్యా శాఖ మంత్రికి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ఈ ఆందోళనకు సిపిఎం ఎంపిలు అమ్రారామ్, బికాష్ రంజన్ భట్టాచార్య, వి.శివదాసన్‌లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విపి సాను, మయూఖ్ బిశ్వాస్ మాట్లాడుతూ 'న్యాయమైన, సమర్థమైన పరీక్షా విధానాన్ని నిర్వహించడంలో ఎన్‌టిఎ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిరంతర పేపర్ లీకేజీలు, పరీక్షల వాయిదాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.

## సహకార సంఘాలు బడుగు వర్గాల సంక్షేమ గొడుగులు

సహకార సంఘ ఉద్యమం బడుగు బలహీన పేద కార్మికులు, చిన్న ఉత్పత్తిదారుల పాలిట పెన్నిధిగా మారడం చూస్తున్నాం. 1923లో ప్రారంభమైన సహకార ఉద్యమ వేదిక "అంతర్జాతీయ సహకార సమాఖ్య(ఇంటర్నేషనల్ కొఆపరేటివ్స్ అలియాన్స్, ఐసిఏ)" ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి అయిన శుభ సందర్భంగా 1995 నుంచి ప్రతి ఏట జూలై తొలి శనివారం, అనగా 06 జూలై 2024న "అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని (ఇంటర్నేషనల్ డే ఆఫ్ కొఆపరేటివ్స్)" ఐరాస సభ్య దేశాలు పాటించడం ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ సహకార దినం-2024 ప్రచార థీమ్‌గా "అందరి ఉజ్వల భవితకు అపూర్వ వేదికలు సహకార సంఘాలు (కొఆపరేటివ్స్ బిల్డ్ ఏ బెట్టర్ ఫ్యూచర్ ఫర్ ఆల్)" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పించడం కొనసాగుతోంది. 2025 ఏడాదిని "అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025"గా ఐరాస గుర్తించిన వేళ నేటి అంతర్జాతీయ సహకార దిన వేడుకలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన సభ్యుల సమాన చేయూతతో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అవసరాలు/ఆకాంక్షలను తీర్చుతున్న స్వచ్ఛంద స్వయం ప్రతిపత్తి కలిగిన ఐక్య వేదికలను సహకార సంఘాలుగా అర్థం చేసుకోవాలి. వినియోగదారుల, రిటైల్, హౌజింగ్, కమ్యూనిటీ,వర్కర్స్, వ్యాపార/ఉపాధి, కొనుగోలు, ప్రొడ్యూసర్, బహుళ స్టేక్‌హోల్డర్స్, యుటిలిటీ, అడ్వర్టైజింగ్, లాండర్, క్రెడిట్, మార్కెటింగ్, సహకార బ్యాంకింగ్/భీమా లాంటి పలు రకాల సహకార సంఘాలు విశ్వ మానవాళికి నిరంతరం సేవలను అందిస్తున్నాయి. ఆర్థికంగా బలమైన వ్యాపార వేత్తల దోపిడీని నిరోధించి బలహీన వర్గాలకు బాసటగా నిలవడానికి సహకార ఉద్యమాలు ప్రయత్నిస్తున్నాయి. సహకార సంఘాలు విక్రయించే ఉత్పత్తులు చవకగా ఉండడమే కాకుండా మధ్యవర్తులు లేకుండా నేరుగా ఉత్పత్తుల సేకరణ ద్వారా ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. సహకార సంఘాలు తమ సభ్యులకు రుణాలను ఇవ్వడం, బ్లాక్ మార్కెట్‌కు తావు లేకుండా సేవలు అందిస్తున్నాయి. అల్పాదాయ సంఘాల్లో పరిమిత మూలధనం, అసమర్థ నిర్వహణతో తిరోగమనం, అనవసర ప్రభుత్వ జోక్యం, సభ్యుల మధ్య పోరాటాలు, పరిమిత ఆదాయ వ్యయాలు, నూతన పోకడలను ఒంటపట్టించుకోకపోవడం, ప్రేరణ కొరవడడం లాంటి ప్రతికూలాలు కూడా సహకార సంఘాలను వెంటాడుతున్నాయి. సహకార సంఘాలు అల్పాదాయ గ్రామీణ బడుగులకు సంక్షేమ గొడుగులు పడుతూ సమ్మిళిత సుస్థిరాభివృద్ధికి ఊతం ఇవ్వడం అనాదిగా జరుగుతోంది. ప్రజాస్వామ్య విలువలకు పట్టం కడుతూ, ప్రాథమిక సభ్యుల చేయూతతో ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ ప్రతికూల మార్పులను దృష్టిలో పెట్టుకొని సహకార సంఘాలు అమూల్య సేవలను అందించడం చూస్తున్నాం. సహకార వ్యవస్థలు ప్రపంచ మానవాళి శాంతికి నెలవులుగా పరస్పర అవగాహన, సమానత్వ సూత్రాలకు చిరునామాలుగా పేరు తెచ్చుకోవడం గమనిస్తున్నాం. సహకార ఉద్యమాలు అన్ని దేశాల్లో సామాన్యుల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చాయని ఐరాస గుర్తు చేస్తున్నది. ప్రజాసంక్షేమమే ఊపిరిగా సేవలు అందిస్తున్న సహకార సంఘాల సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, డిజిటల్ యుగపు సాంకేతికలను ఒంట పట్టించుకొని నిత్య సానుకూల మార్పులతో సహకార ఉద్యమాలు మరింత వేగాన్ని పెంచాలని, పేదరిక నిర్మూలనలో ఈ సంఘాలు అవిరళ కృషి చేయాలని ఐరాస సుస్థిరాభివృద్ధిన లక్ష్యాలు-2030 కూడా దారి చూపడం విశేషం. సహకార సంఘాలు కొఆపరేటివ్ చట్టం పరిధిలో నమోదు చేసుకోవడం తప్పనిసరి అని తెలుసుకోవాలి. ప్రపంచ సహకార ఉద్యమానికి పుట్టిల్లు ఇంగ్లాండ్ కాగా, ఈ ప్రపంచ సహకార ఉద్యమ పితామహుడిగా యూకెకు చెందిన 'రాబర్ట్ ఓవెన్'ను పేర్కొంటారు. 1892లో సర్ ఫ్రెడ్రిక్ నికల్సన్ అనే ఆంగ్లేయుడు తొలిసారి నాటి మద్రాస్‌లో కార్మికుల నిమిత్తం వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయడం, 1904లో సహకార క్రెడిట్ చట్టం తీసుకురావడంతో ఆయనను "భారత సహకార పితామహుడి'గా పిలుస్తున్నాం. ఈ సహకార సంఘాల చట్టానికి కాలక్రమంగా 1912, 1919ల్లో సవరణలు చేయడం, 1939 నుంచి ఆర్‌బిఐ ఆర్థిక చేయూత కూడా ఇవ్వడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల సహకార సంఘాలు ఉండగా, భారత్‌లో 8.55 లక్షల సంఘాలు (91 శాతం గ్రామీణ ప్రాంతాల్లో) సేవలు అందిస్తున్నాయి. ఇఫ్కో, అముల్, హోప్‌కాం, ఇండియన్ కాఫీ హౌజ్ లాంటి పలు సహకార సంఘాలు మన దేశంలో ఉన్నాయి. వ్యవసాయాధార భారతంలో 1.94 లక్షల డైరీ సొసైటీలు, 330 షుగర్ సొసైటీలతో పాటు స్పిన్నింగ్, వ్యవసాయ ఉత్పత్తులు, డిసిసిబి బ్యాంకింగ్, పిఏసీ లాంటి పలు రకాల సొసైటీలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సహకార ఉద్యమ పితామహుడిగా 'వేమవరపు రామదాసు పంతులు'కు పేరుంది. 1964లో ఉమ్మడి ఏపీలో 'ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టాన్ని' రూపొందించి, 1995లో సవరించి 'పరస్పర సహాయక సహకార సంఘాల చట్టం' తీసుకురావడం జరిగింది. తెలుగు రాష్ట్రాల్లో సహకార సంఘాల ద్వారా ఆహార భద్రత, ఉపాధి కల్పన, వృథాను అరికడుతూ కలిసికట్టుగా పరిమిత వనరులను పంచుకోవడం, పొదుపును ప్రోత్సహించడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, స్వల్ప వడ్డీతో రుణాలు అందజేయడం, ఉత్పత్తులను లాభసాటిగా విక్రయించడం, అవసర ఉత్పత్తులను చవకగా కొనుక్కోవడం లాంటి ప్రయోజనాలతో సరికొత్త బాటలో కొనసాగుతున్నాయి. మన రాష్ట్రాల్లో విస్తరించి ప్రముఖమైనవిగా గుర్తింపును పొందుతున్న 'ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఏసీఎస్)' బలహీన వర్గాలకు బాసటగా నిలుస్తున్నాయి. జిల్లాల్లో సహకార ఉద్యమాల్ని బలోపేతం చేయడానికి సహకార శాఖ డిసిసిబీలను నెలకొల్పడం జరిగింది.

# ఇదొక్కటి పెడితే చాలు పిల్లలు బలంగా ఉంటారు..



పిల్లలకు పౌష్టిక ఆహారం అదించడం అంటే పెద్ద టాస్కే కదా. వీరికి మంచి ఆహారం అందించాలి. బయట తయరు చేసిన వాటిని పిల్లలకు పెట్టడం మంచిది కాదు. ఎన్నో రకాల పదార్థాలు కల్తీ అవుతున్న ఈ కాలంలో పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. మరి వీరికి పౌష్టికాహారం ఎలా అందించాలి అనుకుంటున్నారా? ఇప్పుడు మంచి పోషకాలు కలిగిన ఓ ఆహారం గురించి తెలుసుకుందాం. అదే ఉగ్గు. ఉగ్గులో చాలా పోషకాలు, విటమిన్లు ఉంటాయి. దీన్ని ఆరు నెలల పిల్లలకు మాత్రమే తినిపించాలి. బయట నుంచి తీసుకొని వచ్చే సెర్లాక్ లకు బదులు పిల్లలకు ఉగ్గు అందివవ్వడే ఉత్తమం అంటారు పెద్దలు. ఎందుకంటే ఈ ఉగ్గు ద్వారా పిల్లలకు అన్ని రకాల విటమిన్లు, పోషకాలు అందించవచ్చు. దీన్ని బియ్యం, పప్పులతో తయారుచేస్తారు. మరి మీ పిల్లలకు దీన్ని పెట్టాలి అనుకుంటున్నారా?

ఉగ్గు తయారీకి కావలసిన పదార్థాలు: బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు, శనగపప్పు, బాదం, క్యాష్ నట్స్ . బియ్యం తీసుకున్న దానిలో పావు వంతు ఈ పప్పులు తీసుకోవాలి. ఉగ్గు తయారీ విధానం :- బియ్యాన్ని నీళ్లతో శుభ్రంగా కడికి ఫ్యాన్ గాలికి ఆరబెట్టాలి. అలాగే పప్పులను కూడా కడిగి ఎండలో ఎండబెట్టాలి. ఫస్ట్ స్టవ్ ఆన్ చేసి ఒక బౌల్లో వన్ టేబుల్ స్పూన్ నెయ్యి వేసి బియ్యని దొరగా వేయించాలి. వాటిని పక్కకి పెట్టి, పప్పులు కూడా కొంచెం నెయ్యి వేసి దొరగా వేయించుకోవాలి. వేడి చల్లారిన తరువాత వీటిని వేరువేరుగా మెత్తగా పౌడర్ చేసుకోవాలి. ఈ పౌడర్ ని జల్లడ పట్టాలి. అంతే ఉగ్గు పౌడర్ రెడీ అయినట్టే. ఉగ్గు తయారు చేసే విధానం: ఒక గిన్నె లో టీ గ్లాస్ వాటర్ తీసుకొని స్టవ్ ఆన్ చేసి నీటిని బాగా మరగించాలి. మరొక గ్లాస్ లో టేబుల్ స్పూన్ ఉగ్గు పౌడర్ను కొన్ని వాటర్ లో కలిపి ఆ మరిగే నీటిలో పోసి బాగా కలపాలి. లేకపోతే ఉండలు కడుతాయి. మెత్తగా జారుడుగా అవ్వాలి. అప్పుడు ఉగ్గు తయారు అయినట్టు. చల్లారిన తర్వాత తినిపిస్తే సరిపోతుంది. ఈ ఉగ్గు ఎప్పటికప్పుడు ఫ్రెష్ గా తయారుచేసి పిల్లలకు పెట్టాలి.

## డెంగ్యూ నుంచి తప్పించుకోవడం ఎలా?



వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు వెంటనే వస్తుంటాయి. రోగనిరోధక శక్తి ఉన్న వారు త్వరగా వ్యాధుల బారిన పడుతుంటారు. ఇక ఈ కాలంలో దోమలు మరింత పెరుగుతాయి. ఈ దోమలు డెంగ్యూ వైరస్ ను వ్యాప్తి చెందుతాయి. ఇండియాలో తెలంగాణ, ఆంధ్రాలో ఈ డెంగీ కేసులో ఎక్కువ నవోదు అవుతుంటాయి. చాలా ప్రమాదకరమైన ఈ వ్యాధి నుంచి సులభంగానే బయటపడవచ్చు. మరి డెంగ్యూ నుంచి తప్పించుకోవాలంటే ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.ఉదయం, సాయంత్రం దోమలు విపరీతంగా ఉంటాయి కాబట్టి వీటిని వికర్షించే మస్కిటో రిపెలెంట్స్ ఉపయోగించాలి. ముఖ్యంగా పికారిడిన్, లెమన్ యూకలిప్టస్ ఆయిల్ వంటివి బెటర్. డెంగీని వ్యాప్తి చెందించే దోమలు నీటిలో ఎక్కువగా పెరుగుతుంటాయి. అందుకే ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. టైర్లు, కూజాలు, డబ్బాలలో నీరు చేరి నిల్వ ఉంటుంది. ఇందులో త్వరగా దోమలు పెరుగుతాయి. వీటిలో నీటిని తొలగించండి. డ్రమ్ములు, ట్యాంకులు ఉంటే వాటిని మూతతో కవర్ చేయండి. ఇంటి చుట్టూ చెరువులు, కుంటలు ఉంటే జాగ్రత్త. దోమలు కుట్టకుండా పొడవైన స్లీవ్స్ ఉండే దుస్తులు ధరించండి. శరీరం మొత్తం కప్పి ఉంచేలా చూసుకోండి. కాళ్లను కూడా కవర్ చేసే ప్యాంట్లు వేసుకోండి. కుదిరితే సాక్స్ లు కూడా వేసుకోవాలి. డెంగ్యూ వస్తే శరీరంలోని నీరు మొత్తం పోతుంది. అందుకే రోజు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీరు తీసుకోవాలి. కొబ్బరి నీరు, %ూ=ూ% డ్రింక్ ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ శరీరానికి కోల్పోయిన లవణాలను తిరిగి అందిస్తాయి కాబట్టి వీటిని తీసుకోవాలి.

## మల్టీ విటమిన్లు తీసుకుంటున్నారా....?




శరీరానికి విటమిన్లు చాలా అవసరం. వీటి వల్ల ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది అంటారు నిపుణులు. విటమిన్లు తక్కువగా ఉంటే చాలా వ్యాధులు వస్తాయి. అందుకే విటమిన్లు, మినరల్స్ లభించే ఆహారాలను తీసుకోవాలి. ఈ విటమిన్?లు మంచి ఆహారం, న్యాచురల్?గా ప్రకృతి నుంచి అందుతాయి. ఎక్కువగా కష్టపడకుండా ఏ విటమిన్ ఎందులో లభిస్తుందో తెలుసుకొని తింటే చాలు. కానీ ఇలా చేయకపోవడం వల్ల చాలా మంది విటమిన్ డెఫిషియన్స్ తో బాధ పడతారు. ఇక వైద్యులు ఈ విటమిన్ లను క్యాప్సిల్స్ రూపంలో ఇస్తుంటారు.సరైన ఆహారం, సరైన సమయానికి తీసుకోకుండా మల్టీవిటమిన్ ల వాడకాన్ని పెంచారు ప్రజలు. అధికంగా ఈ మల్టీవిటమిన్ లను తీసుకోవడం వల్ల త్వరగా మరణం సంభవించే అవకాశం ఉందని చెబుతున్నాయి సర్వేలు. అమెరికాకు సంబంధించిన నేషనల్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ పరిశోధకులు 1990 నుంచి 3 లక్షల ప్రజల మీద 20 సంవత్సరాల నుంచి ఈ అధ్యయనం చేశారు.మల్టీ విటమిన్ ల వాడకం వల్ల ఎక్కువ కాలం జీవిస్తారు అనేది వాస్తవం కాదట.

## డయాబెటిస్ ఉందా? రైస్ తినాలా వద్దా...?



డయాబెటిక్ పేషెంట్లు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తినే ఆహారం విషయంలో తాగే కూల్ డ్రింక్స్ విషయంలో జాగ్రత్త మస్ట్. లేదంటే అనారోగ్య సమస్యలు వచ్చే ఆస్కారం ఉంటుంది.డయాబెటిస్ ఉంటే అన్నానికి కాస్త దూరంగా ఉండాలి అంటారు నిపుణులు. తెలుగు ప్రజలకు అన్నం తినడం అంటేనే ఇష్టం. అలాంటిది పూర్తిగా అన్నం మానేయమంటే మానేస్తారా? మరి అన్నం విషయంలో వైద్యులు ఏమంటున్నారో తెలుసా? డయాబెటిస్ ఉన్నవారు పూర్తిగా అన్నం తినడం మానేయాల్సిన అవసరం లేదంటున్నారు. డైలీ డైట్‌లో అన్నాన్ని చేర్చుకోవచ్చని.. కానీ క్రమ పద్ధతిలో తినాలి అంటున్నారు డైటీషియన్ లు. కేవలం రోజుకు ఒకసారి 30-40 గ్రాముల బియ్యం తీసుకోవాలి అని.. దీని వల్ల బరువు కూడా కంట్రోల్ లో ఉంటుంది అంటున్నారు. ఇందులో అంటే 30-40 గ్రాముల బియ్యంలో 150 నుంచి 170 కేలరీలు ఉంటాయట. ఇలా తినడం వల్ల బరువు పెరగరని, శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది అంటున్నారు నిపుణులు. బియ్యంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల గ్లైసెమిక్ ఇండెక్స్ పెరుగుతుంది. కాబట్టి, షుగర్ స్పైక్‌ను నియంత్రించడానికి, బియ్యంతో తగినంత ప్రోటీన్ ఫైబర్ తినాలని సూచిస్తున్నారు. అంటే కూరగాయలు, చేపలు, చికెన్, సలాడ్ వంటివి తీసుకోవడం ముఖ్యం. మధ్యాహ్నం లేదా జిమ్, వ్యాయామం చేసిన తర్వాత అన్నం తినాలి అని సూచిస్తున్నారు నిపుణులు. ఈ సమయంలో అన్నం తినడం వల్ల ఆ తర్వాత పనుల మీద తిరుగుతూ నడుస్తూ ఉంటారు కాబట్టి సమస్య ఉండదు. దీనివల్ల బరువు పెరగరు. బరువు కూడా అదుపులో ఉంటుంది.

## జామ పండ్లతోనే కాదు..ఆకులలో కూడా ఔషధ గుణాలు..



జామ పండు, ఆకులలో విటమిన్ సి, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి మీ గుండె, జీర్ణక్రియ, ఇతర శరీర వ్యవస్థలకు సహాయపడతాయి. దీని బెరడు లేత ఆకుపచ్చ లేదా పసుపు రంగులో ఉంటుంది. గింజలు తినదగినవి. అదనంగా జామ ఆకులను హెర్బల్ టీగా ఉపయోగిస్తారు. అనేక వ్యాధులను నయం చేయడంలో ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. జామ పండ్లు, ఆకులు విటమిన్ సి, పొటాషియంతో సహా పోషకాలను కలిగి ఉంటాయి. ఇవి మీ గుండె, జీర్ణక్రియకు ప్రయోజనకరంగా ఉండేందుకు దోహదం చేస్తాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్న 20 మంది వ్యక్తులపై జరిపిన అధ్యయనంలో జామ ఆకు టీ తాగడం వల్ల భోజనం తర్వాత బ్లడ్ డయాబెటిస్ లెవల్స్ 10 శాతానికి పైగా తగ్గుతాయని తేలింది. జామ ఆకులను తినడం వల్ల ఈ విషయంలో ప్రయోజనాలు ఉన్నాయి. జామ ఆకుల సారం ఋతు నొప్పి తీవ్రతను తగ్గిస్తుంది. బాధాకరమైన లక్షణాలను ఎదుర్కొంటున్న 197 మంది స్త్రీలపై జరిపిన ఒక అధ్యయనంలో ప్రతిరోజూ 6 మి.గ్రా జామ ఆకు సారాన్ని తీసుకోవడం వల్ల నొప్పి తీవ్రత తగ్గుతుందని తేలింది. జామ ఆకులు బరువును నియంత్రించడంలో కూడా చాలా మేలు చేస్తాయి. ఇది మీ జీవక్రియను బలపరుస్తుంది. వీటిని తినడం వల్ల ఐరన్ లోపం కూడా తొలగిపోతుంది. రక్తహీనతతో బాధపడేవారు దీన్ని తీసుకోవాలి. ఇది చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. ఇది మొటిమలను కూడా తొలగిస్తుంది. ఇది గ్లోను పెంచడంలో కూడా సహాయపడుతుంది. (గమనిక): ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించండి.సరం.

## శరీరం నుంచి దుర్వాసన వస్తుందా....?



చాలా మందికి శరీరం దుర్వాసన వస్తుంటుంది. ఈ దుర్వాసన వల్ల నలుగురిలోకి వెళ్లాలి అంటే కూడా ఇబ్బంది పడుతుంటారు. దీనివల్ల ఖరీదైన పర్ఫ్యూమ్ లు వాడుతుంటారు.అయినా కూడా వారికి ఏదో తెలియని ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. మీరు కూడా ఇలాంటి సమస్యతో బాధ పడుతున్నారా? ఇంతకీ ఈ సమస్య ఎందుకు వస్తుంది? ఎలాంటి ఆహారం వల్ల వస్తుందో ఈ ఆర్టికల్ లో తెలుసుకుందాం. మసాలాలు ఎక్కువ ఉండే ఫుడ్ తీసుకోవద్దు అంటున్నారు నిపుణులు. దీని వల్ల నోటి నుంచి దుర్వాసన వస్తుందట. ముఖ్యంగా లవంగాలు, ఇలాచీ, పసుపు, మెంతులు వంటి మాసాలాలు నోటి నుంచి వచ్చే దుర్వాసనకు కారణం అవుతాయట. వెల్లుల్లి, ఉల్లిపాయలు నాలుక, దవడకు అతుక్కుపోయి నోటి నుంచి దుర్వాసన వచ్చేలా చేస్తాయట. దీని వల్ల శరీరంలో ఉష్ణోగ్రత కూడా పెరిగిపోతుంది. అందుకే శరీరం నుంచి చెమట బయటకు వెళ్తుంది. చమట వస్తూ దుర్వాసన కూడా వస్తుంది.మాంసం ఎక్కువగా తీసుకుంటే నోటి నుంచి మాత్రమే కాదు శరీరం నుంచి కూడా దుర్వాసన వస్తుందట. క్యాబేజీ గోబీ వల్ల కూడా ఈ సమస్య పెరుగుతుంది. ఇవి సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని విడుదల చేస్తాయి. ఇవి చమట, శ్వాస ద్వారా బయటకు వచ్చినప్పుడు స్మెల్ వస్తుంది. పరిష్కారం ఇదిగో.. స్నానం చేస్తున్నప్పుడు టమాట రసాన్ని స్నానం చేసే నీటిలో కలుపుకోవాలి. ఇలా చేయడం వల్ల దుర్వాసన కలిగించే బ్యాక్టీరియా తగ్గుతుంది. వంట సోడ కూడా చెమట వాసనను తగ్గిస్తుంది. ఓ కప్పు నీటిలో రెండు టేబుల్ స్పూన్ల బేకింగ్ సోడా వేసి బాగా కలపండి. దీన్ని అండర్ ఆర్మ్స్ లో స్ప్రే చేస్తే సరిపోతుంది. విపరీతమైన చెమట స్మెల్ తో మీరు బాధ పడుతుంటే కాస్త యాపిల్ సైడర్ వెనిగర్ ను కాటన్ తో ముంచి శరీరానికి రాసుకున్న మంచి ఫలితం ఉంటుంది

## పొగ తాగడం వల్ల ఇన్ని సమస్యలా...?



పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం అని ఎన్నో చోట్ల రాసి ఉంటుంది. ఎంతో మంది తప్పని చెబుతుంటారు. ఇది పీల్చేవారి కంటే పక్కన ఉన్నవారికి నష్టం ఎక్కువ ఉంటుంది. అయినా సరే బహిరంగ ప్రదేశాలలో పొగ కాలుస్తుంటారు. గుప్పు గుప్పు మంటూ స్టైల్ గా పొగ తాగే వారు కూడా ఉంటారు. వారికి అదొక పిచ్చి కూడా. పిచ్చి పది రకాలు అన్నట్టు ఎంత చెప్పినా వినని వారు కూడా ఉంటారు. అయితే పొగ తాగడం వల్ల ఎన్ని అనారోగ్య సమస్యలు ఉన్నాయో తెలిస్తే ఇప్పుడే మానేస్తారు. మరి ఓ సారి లుక్ వేయండి. పొగతాగడం వల్ల వృద్ధాప్య ఛాయలు వస్తాయట. కళ్లను కూడా ఎఫెక్ట్ చేస్తుంది పొగ. దంతాలు ఊడిపోవడం, చిగుళ్లలో బ్లడ్ రావడం, ఉబ్బడం వంటివి జరుగుతాయి. కడుపు క్యాన్సర్, లంగ్స్ క్యాన్సర్, యూరినరీ బ్లాడర్ క్యాన్సర్ వంటి రకరకాల క్యాన్సర్లకు పొగనే కారణం అంటున్నారు నిపుణులు. కళ్ల చూపు మందగించి చివరకు కళ్లు పూర్తిగా కనిపించవట. త్వరగా అలసి పోవడం, బ్రీతింగ్ వంటి సమస్యలు వస్తాయి. అయితే ఈ సమస్యలు కేవలం స్మోకింగ్ చేస్తున్న వారికి మాత్రమే కాదు ఈ పొగ పీల్చుకుంటున్న వారికి కూడా వచ్చే అవకాశం ఉందట. కుటుంబంలో ఎవరైన స్మోకింగ్ చేస్తే ఇంట్లో వారు కూడా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే స్మోక్ మానేయడానికి అన్ని విధాలుగా ప్రయత్నించండి. ఎన్నో సమస్యలకు కారణం అవుతున్న ఈ స్మోక్ ను బ్యాన్ చేయండి. మీతో పాటు మీ కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కూడా కాపాడటానికి ప్రయత్నించండి. మరి ఈ స్మోక్ ను ఎలా మానుకోవాలి అని ఆలోచిస్తున్నారా? అది కూడా ఓ సారి చూసేద్దాం. ఎలా మానుకోవాలి: స్మోకింగ్ మానాలని దృఢంగా నిశ్చయం చేసుకోవాలి. సెల్ఫ్ మోటివేషన్ కూడా చాలా అవసరం. కొందరికి కాఫీ తాగిన వెంటనే స్మోక్ చేయాలి అనిపిస్తుంది. మరికొందరికి డ్రింక్ చేసిన వెంటనే స్మోక్ చేయాలి అనిపిస్తుంది. అందుకే టీ, కాఫీ, డ్రింక్ లను మానేస్తే కూడా స్మోకింగ్ నుంచి దూరం అవచ్చు అంటున్నారు నిపుణులు.

## ఓటిటిలోకి రాబోతున్న

# 'కల్కి 2898 ఏడి'



బాక్సాఫీసు వద్ద మంచి రాబడిని సాధించిన 'కల్కి 2898 ఏడి' సినిమా త్వరలో ఓటిటిలోకి రానున్నది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకున్నది. ఈ సినిమా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఓటిటిలోకి ఈ సినిమా కాస్తా ఆలస్యంగానే రానున్నది. దక్షిణ భారతీయ భాషల ఓటిటి హక్కులను అమేజాన్ ప్రైమ్ కొనగా, హిందీ వర్షన్ ఓటిటి హక్కులను నెట్ ఫ్లిక్స్ కొన్నది. అయితే ఈ సినిమా నిర్మాతలు ఓటిటిలో డిజిటల్ రిలీజ్ తేదీని వాయిదా వేయమని కోరుతున్నారని వినికిడి. ఈ సినిమా జులై చివర్లో డిజిటల్ ప్లాట్ ఫామ్ లలోకి వచ్చేస్తుందని మొదట అనుకున్నారు. కానీ ఇప్పుడు తాజాగా వినిపిస్తున్న విషయం ఏమిటంటే ఈ సినిమా సెప్టెంబర్ రెండో వారం ఓటిటిలోకి రాబోతున్నదని. థియేటర్లలో ఈ సినిమా ఇంకా బాగా నడుస్తున్నందున దీనిని మరికొన్ని రోజులు థియేటర్లలో నడపాలని నిర్మాతలు అనుకుంటున్నారట. 'కల్కి 2898 ఏడి' సినిమాలో చాలా మంది నటీనటులు పనిచేశారన్నది తెలిసిన విషయమే. పైగా ఈ సినిమా రెండో భాగం కూడా రూపొందుతోందని, అందులో 60 శాతం పూర్తయిందన్న వార్త కూడా వినిపిస్తోంది. రెండో భాగంలో కొన్ని ముఖ్యమైన సీన్లను మాత్రం ఇంకా పూర్తిచేయాల్సి ఉందంటున్నారు. చాలా వరకు పూర్తయిపోయిందనే అంటున్నారు. అయితే నిర్మాత అశ్వినీ దత్ కల్కి 2898 ఏడి రెండో భాగం విడుల తేదీని ఇంకా అనుకోలేదని స్పష్టం చేశారు. అయితే ఆ సినిమా చాలా వరకు పూర్తయిందనే అన్నారు.

## కుబేర నుంచి రష్మిక పస్ట్ లుక్ గ్లింప్ వైరల్

**హీరోగా ధనుష్ నటిస్తున్న సినిమా లో రష్మిక మందన హీరోయిన్ గా నటిస్తోంది.ఈ చిత్రంలో అక్కినేని నాగర్జున కీలక పాత్ర పోషిస్తున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్ శేఖర్ కమ్మల దర్శకత్వం వహిస్తుండగా ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పీ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మాసిన గడ్డంతో నవ్వుతూ కనిపిస్తున్న ధనుష్ లుక్‌ను మేకర్స్ ఇప్పటికే విడుదల చేయగా తాజాగా రష్మిక మందన ఫస్ట్ లుక్ గ్లింప్స్ చేశారు. నిర్మానుష్యంగా ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లిన రష్మిక గుంతలో పూడ్చి పెట్టిన ట్రాలీ బ్యాగ్‌ను బయటకు తీయగా అందులో డబ్బు ఉంది. ఇంతకీ రష్మిక ఆ బ్యాగ్‌ను ఎక్కడికి తీసుకెళ్లిందనేది సస్పెన్స్ నెలకొంది.**




## ఓటీటీలోకి వచ్చేసిన హాలీవుడ్ యాక్షన్ అడ్వెంచర్

# 'మ్యాడ్ మ్యాక్స్'

*హాలీవుడ్ ఇండస్ట్రీ నుంచి వచ్చిన సూపర్ హిట్ ఫ్రాంచైజీల్లో 'మ్యాడ్ మ్యాక్స్' ఒకటి. యాక్షన్, అడ్వెంచర్, సర్వైవల్ జానర్‌లో వచ్చిన ఈ సిరీస్ చిత్రాలు యావత్ సినీ ప్రియుల్ని విపరీతంగా ఆకట్టుకున్నాయి. 1979లో 'మ్యాడ్ మ్యాక్స్' పేరుతో ప్రారంభమైన ఈ ఫ్రాంఛైజీ ఆ తర్వాత 1981లో మ్యాడ్ మ్యాక్స్ 2 (ది రోడ్ వారియర్) 1985లో మ్యాడ్ మ్యాక్స్3 (బియాండ్ థండర్‌డోమ్), 2015లో మ్యాడ్ మ్యాక్స్ (ఫ్యూరీ రోడ్) అనే నాలుగు భాగాలుగా వచ్చి ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులను విశేషంగా అలరించింది. మొదటి మూడు భాగాలలో మెల్ గిబ్సన్ హీరోగా నటించగా నాలుగో చిత్రం 'మ్యాడ్ మ్యాక్స్: ఫ్యూరీ రోడ్'లో టామ్ హార్డీ హీరోగా నటించారు. అయితే ఈ ఫ్రాంచైజీ నుంచి రీసెంట్‌గా మరో చిత్రం వచ్చిన విషయం తెలిసిందే. ఫ్యూరియోసా: ఏ మ్యాడ్ మ్యాక్స్ సాగా అంటూ వచ్చిన ఈ చిత్రం 2015 లో వచ్చిన మ్యాడ్ మ్యాక్స్ (ఫ్యూరీ రోడ్) సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చింది. మే 23న వరల్డ్ వైడ్‌గా విడుదల అయిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా రెంటల్ విధానంలో అందుబాటులో ఉంది. ఫ్యూరీ రోడ్ లో మెయిన్ రోల్ అయిన ఫ్యూరియోసా (ఛార్లెస్ థెరాన్) ఈ రోడ్ వార్‌లోకి ఎలా వచ్చింది, కింగ్ నుంచి ఐదుగురు భార్యలను ఎందుకు రక్షించిందనే నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. మొదటి నాలుగు సినిమాలకు దర్శకత్వం వహించిన అస్ట్రేలియన్ డైరెక్టర్ జార్జ్ మిల్లర్ ఈ సినిమాకు కూడా దర్శకత్వం వహించాడు. ఈ సినిమాలో థోర్ ఫేమ్ క్రిస్ హెమ్స్ వర్త్ కథానాయకుడిగా నటించగా.. ది మెన్ మూవీ ఫేమ్ ఆన్యా టేలర్ ఛార్లస్ థెరాన్ ప్రధాన పాత్రల్లో నటించారు. అయితే ఈ సినిమా ఫ్యూరీ రోడ్ కు ఫ్రీక్వెల్ గా రానుండగా సీక్వెల్ మ్యాడ్ మ్యాక్స్ (ది వేస్ట్ ల్యాండ్) నెక్స్ట్ పార్ట్ త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది.*





## గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్న నిక్కి తంబోలి



# బాలకృష్ణ అభిమానిగా కనిపిస్తా

రాజ్ తరుణ్ హీరోగాఎ ఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న హోల్సమ్ ఎంటర్‌టైనర్ 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయికగా నటిస్తోంది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే సినిమా ప్రేక్షకులముందుకు వస్తోంది. ఈ నేపధ్యంలో హీరోయిన్ మాల్వి మల్హోత్రా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ఈ సినిమాలో బాలకృష్ణ అభిమానిగా కనిపిస్తా. చాలా ఎనర్జిటిక్ హైపర్ యాక్టివ్ అమ్మాయి పాత్ర నాది. నా క్యారెక్టర్ కారణంగానే కథ అంతా జరుగుతుంది. ఇందులో ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా వుంటాయి. అలాగే నాకో యాక్షన్ సీక్వెన్స్ కూడా వుంది. అది బాలకృష్ణకి రిలేట్ అయ్యేలా వుంటుంది. బాలకృష్ణ మాట్లాడినప్పుడు ఫిల్టర్ వుండదు. ఆయన మనసులో వున్నది వున్నట్లుగా మాట్లాడేస్తారు. ఇందులో నా క్యారెక్టర్ కూడా అలానే వుంటుంది. నా క్యారెక్టర్ మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ ప్రాముఖ్యతని నేర్పించేలా వుంటుంది. తొలి సినిమాలోనే యాక్షన్ సీక్వెన్స్ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. – రవికుమార్ చాలా మంచి విజన్ వున్న డైరెక్టర్. తను ఏదైతే చెప్పారో సరిగ్గా అదే ఎగ్జిక్యూట్ చేశారు. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. – ఇందులో చాలా ఎమోషన్స్, యాక్షన్, డ్రామా, రోమాన్స్, ఫన్ ఎలిమెంట్స్ వున్నాయి. ముఖ్యంగా రాజ్ తరుణ్‌కి క్యారెక్టర్ చాలా ఆసక్తికరంగా వుంటుంది. సైలెంట్‌గా మొదలై వయోలెంట్‌గా మారే క్యారెక్టర్ అతనిది. ఆడియన్స్ ఎంజాయ్ చేసే అన్ని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉన్నాయి"అని అన్నారు.



గరుడ వార్త
శనివారం, జూలై 6, 2024

# రూ.35లకే పేటీఎం ప్రత్యేక హెల్త్ ప్లాన్.......

ప్రముఖ ఆన్‌లైన్ పేమెంట్ సంస్థ పేటీఎం తమ మర్చంట్ పార్టనర్స్ కోసం ప్రత్యేక హెల్త్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. 'పేటీఎం ఫర్ బిజినెస్' యాప్లో 'పేటీఎం హెల్త్ సాథీ' అనే ప్రత్యేక హెల్త్ అండ్ ఇన్కమ్ ప్రొటెక్షన్ ప్లాన్‌ను పేటీఎం యాజమాన్య సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ అందుబాటులోకి తెచ్చింది. తక్కువ ఖర్చుతో సమగ్ర ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలను అందించడం ద్వారా తమ విస్తారమైన వ్యాపార భాగస్వాముల నెట్వర్క్‌కు తోడ్పాటు అందించడానికి పేటీఎం చేస్తున్న ప్రయత్నాల్లో ఈ చొరవ ఒక భాగం.

వ్యాపార భాగస్వాముల శ్రేయస్సును పరిరక్షించడం, వారి ఆరోగ్యం, వ్యాపార కొనసాగింపును నిర్ధారించడం 'పేటీఎం హెల్త్ సాథీ' లక్ష్యం. నెలవారీ సబ్ స్క్రిప్షన్ పై నెలకు కేవలం రూ. 35తో ప్రారంభమయ్యే పేటీఎం హెల్త్ సాథీ తన భాగస్వామ్య నెట్ వర్క్ పరిధిలో అపరిమిత డాక్టర్ టెలీ కన్సల్టేషన్, ఇన్ పర్సనల్ డాక్టర్ విజిట్స్ (ఓపీడీ) వంటి సేవలను అందిస్తోంది. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, సమ్మెలు వంటి వాటి కారణంగా వ్యాపార అంతరాయాలు ఏర్పడినప్పుడు ఆదాయ రక్షణ కవరేజీని కూడా ఇది అందిస్తుంది. డాక్టర్ టెలీ కన్సల్టేషన్ సర్వీస్‌తోపాటు ప్రముఖ ఫార్మసీలలో డిస్కౌంట్లు, రోగనిర్ధారణ పరీక్షలలో తగ్గింపులు వంటి అదనపు ప్రయోజనాలను అందిస్తుంది. క్లెయిమ్ ప్రాసెస్‌ను కూడా సులభతరం చేసింది. యాప్‌లోనే దీన్ని పూర్తి చేయవచ్చు. 'పేటీఎం హెల్త్ సాథీ' పైలట్ సర్వీస్ మే నెలలోనే ప్రారంభమైంది. ఇప్పటికే 3000 మందికి పైగా మర్చంట్ భాగస్వాములు ఉపయోగించుకున్నారు. ఇది విజయవంతం ?కావడంతో కంపెనీ ఈనెల ప్రారంభంలో తన వ్యాపారులందరికీ ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. నెలవారీ సబ్ స్క్రిప్షన్ పై నెలకు కేవలం రూ. 35తో ప్రారంభమయ్యే పేటీఎం హెల్త్ సాథీ తన భాగస్వామ్య నెట్ వర్క్ పరిధిలో అపరిమిత డాక్టర్ టెలీ కన్సల్టేషన్, ఇన్ పర్సనల్ డాక్టర్ విజిట్స్ (ఓపీడీ) వంటి సేవలను అందిస్తోంది. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, సమ్మెలు వంటి వాటి కారణంగా వ్యాపార అంతరాయాలు ఏర్పడినప్పుడు ఆదాయ రక్షణ కవరేజీని కూడా ఇది అందిస్తుంది.




# సామర్థ్య పెంపునకు రూ.230 కోట్ల పెట్టుబడులు



**హైదరాబాద్ :** ఉత్పత్తిని బలోపేతనం చేయడానికి, ఎగుమతి సామర్థ్యాలను పెంచుకోవడానికి రూ. 230 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామని ఎజిఐ గ్రీన్‌ప్యాక్ సిఇఒ రాజేష్ ఖోస్లా తెలిపారు. ప్రస్తుత తయారీ లైన్లను ఆధునీకరించడానికి.. అధిక నాణ్యత గ్లాస్ ప్యాకేజింగ్ సొల్యూషన్ల కోసం వ్యయం చేయనున్నామన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ పెట్టుబడులు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకోవడానికి సహాయ పడనున్నాయన్నారు. భారత మొత్తం ప్యాకేజింగ్ పరిశ్రమ 40 బిలియన్ డాలర్ల (రూ. 3.33 లక్షల కోట్లు) విలువ చేస్తుందన్నారు. ఇందులో గ్లాస్ ప్యాకేజింగ్ 6-7 శాతం వాటా కలిగి ఉంటుందన్నారు. ఈ రంగం ప్రతీ ఏడాది 7-8 శాతం వృద్ధిని నమోదు చేస్తోందన్నారు. గ్లోబల్ గ్లాస్ ప్యాకేజింగ్ పరిశ్రమ 67.28 బిలియన్ డాలర్ల విలువ చేస్తుందన్నారు. 2032 నాటికి 93.69 బిలియన్ డాలర్లకు చేరవచ్చన్నారు. తెలంగాణలోని ఎజిఐ గ్రీన్‌ప్యాక్ ప్లాంట్‌లలో 4,000 మందిపైగా పని చేస్తున్నారన్నారు. దేశంలో తమకు ఏడు తయారీ ప్లాంట్లు ఉన్నాయన్నారు. రోజుకు 1700 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నామన్నారు. 3మిల్లీ లీటర్ల గాజు సీసాల నుంచి ఆరు లీటర్ల సామర్థ్యం వరకు తయారు చేస్తున్నామన్నారు. తమ మొత్తం రెవెన్యూలో 6-7 శాతం వరకు ఎగుమతుల నుంచి వస్తోందన్నారు. ప్రస్తుతం ఉత్తర అమెరికా, సౌత్ ఆఫ్రికా, మధ్య ఈశాన్య దేశాలకు ఎగుమతులు చేస్తున్నామన్నారు. ఎగుమతుల కంటే తాము ప్రధానంగా దేశీయ మార్కెట్‌పైనే దృష్టి సారిస్తున్నామని రాజేష్ ఖోస్లా తెలిపారు.

ఈ పెట్టుబడులు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకోవడానికి సహాయ పడనున్నాయన్నారు. భారత మొత్తం ప్యాకేజింగ్ పరిశ్రమ 40 బిలియన్ డాలర్లు (రూ. 3.33 లక్షల కోట్లు) విలువ చేస్తుందన్నారు. ఇందులో గ్లాస్ ప్యాకేజింగ్ 6-7 శాతం వాటా కలిగి ఉంటుందన్నారు. ఈ రంగం ప్రతీ ఏడాది 7-8 శాతం వృద్ధిని నమోదు చేస్తోందన్నారు. గ్లోబల్ గ్లాస్ ప్యాకేజింగ్ పరిశ్రమ 67.28 బిలియన్ డాలర్ల విలువ చేస్తుందన్నారు.

# బ్యాంకర్లతో ఆర్బీఐ గవర్నర్ భేటీ...




బ్యాంకర్లతో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కీలక భేటీ జరిగింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, కొన్ని ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో బుధవారం ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చించారు. రుణాలు, డిపాజిట్ వృద్ధికి మధ్య అంతరం, లిక్విడిటీ రిస్క్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మోసాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు వంటి అనేక అంశాలు సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు సెంట్రల్ బ్యాంక్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. బ్యాంకుల్లో భద్రతా చర్యలను బలోపేతం చేయడం, సరిహద్దు లావాదేవీల్లో రూపాయి వినియోగాన్ని పెంచడం, ఆర్బీఐ ఆవిష్కరణ కార్యక్రమాలలో బ్యాంకుల భాగస్వామ్యం గురించి కూడా చర్చించారు. తమ పరిధిలోకి వచ్చే బ్యాంకులు, సంస్థల సీనియర్ మేనేజ్‌మెంట్‌తో తరచూ ఆర్బీఐ సమావేశాలు నిర్వహిస్తూ ఉంటుంది. అందులో భాగంగానే తాజా సమావేశం జరిగింది. ఇంతకుముందు భేటీ ఫిబ్రవరి 14న జరిగినట్లు ఆర్బీఐ తెలిపింది. ఈ సమావేశానికి ఆర్బీఐ గవర్నర్‌తోపాటు, డిప్యూటీ గవర్నర్లు ఎం. రాజేశ్వర్ రావు, స్వామినాథన్, ఆర్బీఐ నియంత్రణ, పర్యవేక్షణ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.


# హైదరాబాద్‌లో 40% పెరిగిన కార్యాలయాల అద్దె లావాదేవీలు



**హైదరాబాద్ :** అంతర్జాతీయ సంస్థలతో పాటు, దేశీయ కంపెనీలూ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపడంతో, హైదరాబాద్‌లో కార్యాలయాల స్థలానికి గిరాకీ పెరిగింది. ఈ ఏడాది ప్రథమార్ధంలో మొత్తం 50 లక్షల చదరపు అడుగుల స్థలం అద్దెకు వెళ్లింది. గత ఏడాది ఇదే కాలంలో 36 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని సంస్థలు అద్దెకు తీసుకున్నాయి. దీంతో పోలిస్తే ఈసారి అద్దె లావాదేవీల్లో 40% వృద్ధి కనిపించిందని స్థిరాస్తి సేవల సంస్థ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. ప్రముఖ సంస్థలు తమ వ్యాపార విస్తరణకు హైదరాబాద్‌ను కీలక స్థానంగా భావిస్తున్నాయని పేర్కొంది. అందుబాటులో ఉండటమే..: హైదరాబాద్‌లో కార్యాలయ స్థలానికి గిరాకీ పెరిగేందుకు ఇక్కడి మౌలిక వసతులతో పాటు, అనువైన వ్యాపార విధానాలు, స్థిరమైన ప్రభుత్వం లాంటివి తోడ్పడుతున్నాయని నివేదిక పేర్కొంది. ఇక్కడ స్థిరాస్తి ధరలు అందుబాటులో ఉండటం, నిపుణుల లభ్యతా అనుకూలంగా ఉందని తెలిపింది. దీంతో హైదరాబాద్‌పై పెట్టుబడిదారులు, స్థిరాస్తి డెవలపర్లు, సంస్థలూ సానుకూలంగా ఉంటున్నట్లు వెల్లడించింది. గ్రేడ్ ఏ ప్రాజెక్టులకు..: భవిష్యత్ విస్తరణ ప్రణాళికలకు వీలుగా ఉండేలా చూసుకోవడంతో పాటు, ఆధునిక వసతులు, కీలక ప్రాంతాల్లో ఉన్న గ్రేడ్ ఏ వాణిజ్య ప్రాజెక్టులకు అధిక గిరాకీ ఉందని నివేదిక పేర్కొంది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో కొత్తగా 27 లక్షల చదరపు అడుగుల స్థలం అందుబాటులోకి వచ్చిందని పేర్కొంది. ఐటీ రంగంలోనే..: అత్యధిక లీజింగ్ లావాదేవీలు ఐటీ-బీపీఎం రంగంలోనే జరిగాయి.

మొత్తం అద్దెకు వెళ్లిన స్థలంలో 36% వరకు ఈ సంస్థలే తీసుకున్నాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల సంస్థలు 29% స్థలాన్ని అద్దెకు తీసుకున్నాయి. ఫ్లెక్సిబుల్ వర్క్‌ప్లేస్ సంస్థలు 17% స్థలాన్ని తీసుకున్నాయి. వీటితో పాటు కో-లివింగ్ లాంటి వాటి కోసమూ అద్దె లావాదేవీలు జరిగాయి.

# ముగిసిన కూ యాప్ కూత....!




**న్యూఢిల్లీ :** ట్విట్టర్‌కు పోటీగా నిలుస్తుందని భావించిన భారత సోషల్ మీడియా యాప్ 'కూ' మూతపడిపోయింది. బుధవారం నుంచి తమ సంస్థ సేవలను నిలిపివేసినట్లు కూ యాప్ సహ వ్యవస్థాపకులు రాధాకృష్ణ వెల్లడించారు.

కూ యాప్ విక్రయం కోసం డైలీహంట్ సహా వివిధ కంపెనీలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అమ్మకపు చర్చలు సఫలం కాకపోవడంతో లిటిల్ ఎల్లో బర్డ్ ఇక గుడ్‌బై చెప్పేస్తోందంటూ లింక్డ్‌ఇన్‌లో రాధాకృష్ణ వెల్లడించారు. కూ యాప్ 2019లో ప్రారంభమయ్యింది. స్థానిక భాషల్లోనూ దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దాదాపు పదికి పైగా భాషల్లో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతు ఉద్యమ సమయంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్విట్టర్‌లో ఎక్కువ పోస్టులు రావడంతో.. అందులోని పలు ఖాతాలను బ్లాక్ చేయాలని కేంద్రం ఒత్తిడి తీసుకువచ్చింది. ట్విట్టర్‌కు ప్రత్యామ్నాయంగా బిజెపి వర్గాలు కూ యాప్‌ను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాయి. స్వయంగా కేంద్ర మంత్రులు ఆత్మనిర్భర్ యాప్‌గా ప్రచారం చేశారు. ఒక దశలో కూ యాప్‌నకు రోజుకు 21 లక్షల యాక్టివ్ వినియోగదారులు వచ్చారు. ఈ యాప్‌ను 6 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. నైజీరియా, బ్రెజిల్‌కు కార్యకలాపాలను విస్తరించింది. కానీ.. ఈ సంస్థ ఆర్థిక నష్టాలు క్రమంగా పెరిగి పోయాయి. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి జారుకుంది. పలు సార్లు ఉద్యోగులపై వేటు వేసింది. కష్టాల్లోంచి బయట పడలేక తుదకు మూత వేసుకుంది.

# బిల్డర్ ప్లాట్ స్కీమ్‌లో 8,000 ఫ్లాట్లు....!




గ్రేటర్ నోయిడా అథారిటీ ఐదు బిల్డర్ ప్లాట్‌ల కేటాయింపు కోసం కొత్త పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా నగరంలో కనీస ఆదాయం రూ. 500 కోట్లు వస్తుందని, 8,000 కొత్త ఫ్లాట్ల నిర్మాణం నిర్మాణం జరుగుతుందని అంచనా వేస్తోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో ఈ-వేలం ద్వారా కేటాయింపు జరుగుతుందని అధికారిక ప్రకటనలో అథారిటీ తెలిపింది. గ్రేటర్ నోయిడా అథారిటీ బిల్డర్ విభాగం ఈ పథకాన్ని ప్రారంభించింది. దీని కోసం మొత్తం 99,000 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు పేర్కొంది. ఒమిక్రాన్ వన్ ఎ, ఎంయూ, సిగ్మా 3, ఆల్ఫా 2, పై వన్ సెక్టార్లలో ప్లాట్లు ఉన్నాయి. గ్రేటర్ నోయిడాను ఆగ్రా, మథురలతో కలిపే యమునా ఎక్స్‌ప్రెస్ వే, ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే (ఈపీఈ)తో ఈ సెక్టార్లకు మంచి కనెక్టివిటీ ఉందని అధికారులు తెలిపారు. ఈ సెక్టార్లు జెవార్‌లో రాబోయే నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయంతో కూడా అనుసంధానం కానున్నాయి. ప్లాట్ పరిమాణం, స్థలాన్ని బట్టి చదరపు మీటరుకు రూ. 48,438 నుంచి రూ. 54,493 వరకు ధర నిర్ణయించారు. రిజర్వ్ ధర ప్రకారం ఈ ఐదు భూముల మొత్తం ధర సుమారు రూ. 500 కోట్లు. ప్లాట్ల కేటాయింపు ఈ-వేలం ద్వారా జరుగుతుంది. దీని తేదీని ఇంకా ప్రకటించలేదన్నారు. ఈ పథకానికి రిజిస్ట్రేషన్ జూలై 2న ప్రారంభమైంది. దరఖాస్తు చేయడానికి చివరి తేదీ జూలై 23.

# అన్అకాడమీలో మళ్లీ ఉద్వాసనలు




**న్యూఢిల్లీ :** ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ అన్అకాడమీలో మరోమారు ఉద్యోగులపై వేటు పడింది. తాజాగా 250 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. వ్యయ నియంత్రణ చర్యలతో వ్యాపార సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే ప్రక్రియలో భాగంగానే ఈ తొలగింపుల నిర్ణయాన్ని తీసుకున్నట్లు అన్అకాడమీ వెల్లడించింది. ప్రస్తుతం స్టార్టప్ సంస్థలు చాలా ఇబ్బందుల్లో ఉండటంతో వైఫల్యాలు చెందుతున్నాయని అన్అకాడమీ వ్యవస్థాపకుడు, సిఇఒ గౌరవ్ ముంజాల్ ఆందోళన వ్యక్తం చేసిన మరుసటి రోజే ఈ తొలగింపులు ప్రకటన రావడం గమనార్హం. ఏడాది కాలంలో మూడో సార్లు తొలగింపులు చేపట్టింది. గతేడాది మార్చి నెలలోనే భారీగా ఉద్యోగులను తొలగించింది. ఆ సంస్థ ఆన్‌లైన్ విద్యా వ్యాపారం తగ్గిపోవడంతో అప్పుడు 10- 12 శాతం మేర ఉద్యోగులపై వేటు వేసింది. గత రెండేళ్లలో దాదాపు 1,500 నుంచి 2000 మంది వరకు ఉద్యోగులను ఇంటికి పంపించింది. స్థిరమైన వృద్ధి, వ్యాపార సామర్థ్యం పెంపు విషయాలను దృష్టిలో పెట్టుకుని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని ఆ కంపెనీ ప్రతినిధి తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా తొలగింపులను చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ దఫా మార్కెటింగ్, సేల్స్‌తో పాటు వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులపై వేటు పడిందని సమాచారం.

# మాజీ డిసిపి మరో మాయ



హైదరాబాద్ : సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో ఉన్న టాస్క్ ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావు మరో వివాదంలో చిక్కుకున్నారు. తాజాగా పీటీ వారెంట్ పై పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఓ ల్యాండ్ వ్యవహారంలో వ్యాపారవేత్తను బెదిరించినందుకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. కంపెనీ వ్యవహారంలో రాధాకిషన్ రావు జోక్యం చేసుకుని సెటిల్మెంట్ చేశారని, రూ. 150 కోట్ల కంపెనీని తక్కువ ధరకే మరొకరికి ఇప్పించారని రాధాకిషన్ రావు పై ఓ వ్యాపారవేత్త ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఇవాళ పీటీ వారెంట్ కింద అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టులో హాజరు పరిచి అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ చేసి క్రియా హెల్త్ కేర్ సంస్థలో రూ.కోట్ల విలువైన తన షేర్లను నలుగురు డైరెక్టర్ల మీదకు బలవంతంగా బదిలీ చేయించారని ఆ సంస్థ వ్యవస్థాపకుడు చెన్నుపాటి వేణుమాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఈ ఏడాది ఏప్రిల్‌లో కేసు నమోదు చేశారు. రాధాకిషన్ రావుతో పాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సహా చంద్రశేఖర్ వేగె, కృష్ణ, గోపాల్, రాజ్, రవి, బాలాజీలపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుల కోసం జూబ్లీహిల్స్ పోలీసులు లుక్ అవుట్ నోటీస్ జారీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన చెన్నుపాటి వేణుమాధవ్ హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేసి, ప్రపంచ బ్యాంకులో పని చేశారు. భారత్‌కు తిరిగొచ్చి 2011లో క్రియా హెల్త్ కేర్ సంస్థను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఖమ్మం జిల్లాలో టెలీ మెడిసిన్, జాతీయ రహదారి అత్యవసర వాహనాల సేవలు అందించే ఈ సంస్థ మొత్తం దాదాపు రూ.250 కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టింది.

ఈ సంస్థలో ఇద్దరు శాశ్వత డైరెక్టర్లు వేణు, బాలాజీ, నలుగురు తాత్కాలిక డైరెక్టర్లుగా గోపాల్, రాజ్, నవీన్, రవి ఉన్నారు. సంస్థకు బాలాజీ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. 2016-17 నాటికి సంస్థలో వేణు -60, బాలాజీ -20, గోపాల్- 10, రాజ్ -10 శాతం చొప్పున వాటాలతో షేర్ హోల్డర్లుగా ఉన్నారు. 2018లో నలుగురు తాత్కాలిక డైరెక్టర్లు గోపాల్, రాజ్, నవీన్, రవి కలిసి వేణు పేరిట ఉన్న 60 శాతం షేర్లను తక్కువ ధరకు విక్రయించాలని, సంస్థను పూర్తిగా తామే నడిపించుకుంటామని ఒత్తిడి చేశారు. ఇదే సమయంలో గోల్డ్ ఫిష్ అబోడే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో చంద్రశేఖర్ వేగె పరిచయమవ్వగా, తాత్కాలిక డైరెక్టర్లు షేర్లు విక్రయించాలంటూ ఒత్తిడి తెస్తున్న విషయాన్ని వేణు అతనితో ప్రస్తావించారు. క్రియా సంస్థలో తాను షేర్ హోల్డర్‌గా మారితే నలుగురు తాత్కాలిక డైరెక్టర్లతో బేరసారాలు నడిపేందుకు అవకాశం ఉంటుందని చంద్రశేఖర్ వేగె వేణుకు చెప్పాడు. ఇందుకు అంగీకరించిన వేణుమాధవ్, మొత్తం రూ.40 కోట్ల విలువ చేసే 4 లక్షల షేర్లను చంద్రశేఖర్ పేరిట బదిలీ చేశాడు.

ఆ తర్వాత చంద్రశేఖర్ ప్లేటు ఫిరాయించి తాత్కాలిక డైరెక్టర్లతోనూ ఇదే తరహాలో ఒప్పందం చేసుకున్నట్లు ఫిర్యాదులో వేణుమాధవ్ పేర్కొన్నారు. నలుగురు తాత్కాలిక డైరెక్టర్ల వేధింపులు ఎక్కువవడంతో 2018 అక్టోబరు 3న బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని వేణుమాధవ్ పేర్కొన్నారు. కొన్ని రోజుల తర్వాత షేర్లు బదలాయించడం లేదని ఆరోపిస్తూ అక్టోబర్‌లో తాత్కాలిక డైరెక్టర్లు కూడా అతనిపై ఫిర్యాదు చేశారు. తొలుత తాను ఇచ్చిన ఫిర్యాదు పట్టించుకోకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. ఆ తర్వాత చంద్రశేఖర్, గోపాల్, రాజ్, నవీన్, రవి తదితరులు అప్పటి టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌తో కలిసి బలవంతంగా షేర్లు బదిలీ చేయించుకోవాలని పథకం వేశారని ఆయన ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2018 నవంబరు 22న ఉదయం ఖాజాగూడ దగ్గర ద్విచక్రవాహనాలపై వచ్చిన ముగ్గురు అడ్డగించి తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని దాడి చేస్తూ బలవంతంగా టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లారని,

ఎస్ఐ మల్లికార్జున్ వేణును ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లు కార్యాలయంలో ఉంచారని తెలిపారు. అప్పటికే చంద్రశేఖర్, గోపాల్, రాజశేఖర్, కృష్ణ, పూర్ణ చందర్‌రావు, బాలాజీ అక్కడికి చేరుకున్నారని, రూ.100 కోట్ల విలువైన కంపెనీ వాటాను చట్టవిరుద్ధంగా బదిలీ చేయాలని బెదిరించడం దారుణమని వారికి చెప్పానన్నారు. గట్టుమల్లు ఆదేశాలతో ఎస్ఐ మల్లికార్జున్ నకిలీ కరెన్సీ కేసులో తీసుకొచ్చిన నిందితుల్ని చితకబాది, తాము చెప్పినట్లు వినకపోతే ఇదే పరిస్థితి తనకూ వస్తుందంటూ బెదిరించారని పేర్కొన్నారు. డిసిపి రాధాకిషన్ రావు వచ్చాక చంద్రశేఖర్ వేగె జోక్యం చేసుకుని డిసిపి చెప్పినట్లు విని డీల్ ముగించాలని సూచించాడని, డీల్‌కు అంగీకరించాలని, ఇంకా ప్రాణాలతో ఉన్నందుకు అదృష్టవంతుడివంటూ తాత్కాలిక డైరెక్టర్లు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే సమయంలో తన లాయర్ శ్రీనివాస్, స్నేహితుడైన లహరి రిసార్ట్స్ యజమాని సంజయ్‌కి కిడ్నాప్ చేసినట్లు సమాచారమిచ్చాడని తెలిపారు. సంజయ్ డిజిపి కార్యాలయానికి వెళ్లి సమాచారం ఇచ్చాడని, డిజిపి ఆఫీసు నుంచి ఇన్‌స్పెక్టర్ గట్టు మల్లుకు కాల్ రాగా,

రాధాకిషన్ రావు మాట్లాడి తనకు పైస్థాయి నుంచి ఆదేశాలు వచ్చాయని బదులిచ్చాడని తెలిపారు. మనీ లాండరింగ్, టెర్రరిజం ఆరోపణలు ఉన్నట్లు చెప్పాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బయటి నుంచి ఎలాంటి సహకారం ఉండదని, ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని రాధాకిషన్‌రావు సూచించాడని, ఒప్పందం చేసుకోకపోతే తప్పుడు ఆరోపణలతో మరిన్ని కేసులు పెట్టిస్తామని తాత్కాలిక డైరెక్టర్లు బెదిరించారన్నారు. తుపాకులు, కర్రలతో బెదిరిస్తూ షేర్లు బదలాయించే ఒప్పందంపై తనతో బలవంతంగా సంతకం చేయించి వదిలేశారని తెలిపాడు. ఈ విషయంపై మీడియా, కోర్టులు, ఇతరులకు సమాచారం ఇస్తే చావు ఎదుర్కోవాల్సి వస్తుందని రాధాకిషన్ రావు బెదిరించాడని, అనంతరం గట్టు మల్లు, ఎస్ఐ బృందానికి రూ.10 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కిడ్నాప్ చేయించి వాటాలు బదిలీ చేయించే వ్యవహారంలో చంద్రశేఖర్, నలుగురు తాత్కాలిక డైరెక్టర్ల నుంచి అదనంగా రూ.10 కోట్లు తీసుకున్నాడని ఫిర్యాదులో వెల్లడించారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డిసిపి రాధాకిషన్ రావుది కీలక పాత్ర**

కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డిసిపి రాధాకిషన్ రావుది కీలక పాత్ర అని పోలీసుల విచారణలో వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన కీలకమైన డేటా ధ్వంసం కుట్రలోనూ ఆయన పాత్ర ఉందని పోలీసులు వెల్లడించారు. ప్రైవేటు వ్యక్తుల ప్రొఫైల్లను ఉపయోగిచిన ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డారు. ఈ సమాచారం బయటకు వస్తే ఎక్కడ తమ భండారం బయటపడుతుందనే భయంతోనే రాధాకిషన్ రావు, ప్రణీత్ రావు, భుజంగరావు తిరుపతన్నతో కలిసి డేటాను ధ్వంసం చేసినట్లు దర్యాప్తు బృందం ఇదివరకే గుర్తించింది.

## రికార్డ్ స్థాయిలో కూలుతున్న వంతెనలు..

# పక్షం రోజుల్లో 10 బ్రిడ్జిలు



బీహార్‌లో వంతెనలు వరుసగా కూలుతున్నాయి. దాంతో.. బిహార్ బ్రిడ్జ ఘటనలు దేశ వ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారాయి. తాజాగా ఒక్క రోజులోనే సివాన్ జిల్లాలో మూడు చిన్న వంతెనలు కూలిపోగా.. సరన్ జిల్లాలో మరొకటి కుప్పకూలింది. ఫలితంగా.. 15 రోజుల్లోనే బీహార్‌లో 10 బ్రిడ్జిలు కూలినట్లు అయింది. గత నెల 18 నుంచి బిహార్‌లోని కిషన్‌గంజ్, అరారియా, మధుబని, తూర్పు చంపారన్, సివాన్‌లో వరసగా వంతెనలు కూలిపోయాయి. ఈ నేపథ్యంలో బీహార్‌లో మౌలిక సదుపాయాల స్థితిపై ఆందోళనలు పెరుగుతున్నాయి. దాంతో.. బీహార్ ప్రభుత్వం దర్యాప్తునకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఆయా ఘటనలు నమోదైన జిల్లాల అధికార యంత్రాంగాల నుంచి నితీశ్ సర్కార్ సమగ్ర నివేదిక కోరింది. నేపాల్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వరద పోటెత్తడంతో ఉత్తర బిహార్‌లోని నదుల నీటి మట్టాన్ని పర్యవేక్షించాలని ఆ రాష్ట్ర జలవనరుల శాఖ.. చీఫ్ ఇంజనీర్లను ఆదేశించింది. ఇదిలావుంటే.. బిహార్‌లో వంతెనలు కూలిపోతున్న ఘటనలపై ప్రధాన ప్రతిపక్షం ఆర్జేడీ విరుచుకుపడుతోంది. ఎక్స్ వేదికగా స్పందించిన ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్.. బిహార్‌లో ఒకే రోజులో 4 వంతెనలు ఎలా కూలిపోయాయి?.. దోషులెవరు?.. ఎన్డీఏ ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రధాని మోదీ, సీఎం నితీష్‌కుమార్ ఇప్పటికైనా వంతెనలు కూలిపోవడంపై నోరు మెదపాలని డిమాండ్ చేశారు. సుపరిపాలన, అవినీతి రహిత ప్రభుత్వం అనే వాదనలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బిహార్‌లో ఏ శాఖలో ఎంత అవినీతి రాజ్యమేలుతుందో ఈ ఘటనలే నిదర్శమన్నారు తేజస్వీయాదవ్. ఇక.. ప్రతిపక్ష నేతల ఆరోపణలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. తేజస్వియాదవ్ కామెంట్స్ కౌంటర్ ఇచ్చేందుకు ప్రయత్నించింది. బిహార్‌లో పాత వంతెనలన్నింటిని సర్వే చేయాలని.. బిడ్జిలు కూలిన ఘటనలపై విచారణ జరపాలని సీఎం నితీశ్‌కుమార్ ఆదేశించినట్లు తెలిపారు బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి. మరోవైపు.. నిర్మాణ నాణ్యత, ఉపయోగించిన వస్తువులపైనా ఫోకస్ పెట్టింది నితీస్ సర్కార్. వంతెనల నిర్వహణపై ప్రభుత్వం సమగ్ర రిపోర్ట్ రూపొందించాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రధానంగా.. వర్షాకాలం నేపథ్యంలో బిహార్‌లోని నదుల్లో పూడికతీత పనులకు కాంట్రాక్టులు జారీ అయ్యాయి. బ్రిడ్జి పిల్లర్ల చుట్టూ మట్టి తొలగించడంతో వాటికి ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని చెప్తున్నారు. దాని వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, దానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు బిహార్ జలవనరుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. వంతెన పూడికతీత పనుల్లో జాగ్రత్తలు తీసుకోవడంలో కాంట్రాక్టర్లు నిర్లక్షం వహించినట్లు తెలుస్తోందన్నారు.

# ప్రజాపాలనలో నిరుద్యోగులకు నిరసన తెలిపే హక్కులేదా: హరీశ్ రావు

హైదరాబాద్: నిరుద్యోగలు మార్చ్‌లో భాగంగా టీజీపీఎస్‌ను ముట్టడించిన నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు ఖండిచారు. హామీలు ఇచ్చి, మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా డిమాండ్ల సాధనే లక్ష్యంగా.. టీజీపీఎస్సీ వద్ద శాంతియుత నిరసన తెలియజేసేందుకు వెళ్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధించడం హేయమైన చర్య అన్నారు. ప్రజాపాలనలో శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా నిరుద్యోగులకు లేదా అని ప్రశ్నించారు. తమ గోసను రిప్రజెంటేషన్ ద్వారా చెప్పుకునే అవకాశం కూడా లేదా అని నిలదీశారు. ఒక వైపు ప్రజా పాలన అని ప్రచారం చేసుకుంటూ నిరుద్యోగుల గొంతులను, హక్కులను రేవంత్ రెడ్డి సర్కార్ అణగదొక్కుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ముమ్మాటికీ ప్రజాపాలన కాదని, అప్రజాస్వామ్యపాలన అని దుయ్యబట్టారు. ఉద్యోగాల కోసం పుస్తకాలు పట్టుకొని చదవాల్సిన విద్యార్థులను నడిరోడ్డుకు ఈడ్చి ధర్నాలు, ఆందోళనలు చేసే దుస్థికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖం తిప్పుకుంటే విద్యార్థులకు నిరుద్యోగులకు తోడు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. సమస్యలు పరిష్కరించే దాక, డిమాండ్లు సాధించే దాకా వదిలిపెట్టేది లేదని చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున



గొంతెత్తుతామని స్పష్టం చేశారు. నిర్విరామ పోరాటం చేస్తామన్నారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగుల అరెస్టులను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధించిన వారిని, అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు.

# ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పే శిరోధార్యం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా పాలనను అందించిందని బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. విద్యుత్ సాగునీరు తాగునీరు వ్యవసాయం తదితర రంగాల్లో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యాచరణ దేశ చరిత్రలోనే మున్నెన్నడూ లేని విధంగా కొనసాగిందని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ ప్రగతిని చూసి మహారాష్ట్ర వంటి పక్క రాష్ట్రాల ప్రజలు తమకూ కెసిఆర్ పాలన కావాలని కోరుకున్నారని తెలిపారు. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే నినాదంతో దేశంలో రైతు రాజ్యం తెచ్చుకోవాలని బిఆర్ఎస్‌తో కలిసి అడుగులేస్తూ ముందుకు కదిలిన మహారాష్ట్ర తదితర రాష్ట్రాల ప్రజలు మొన్నటి తెలంగాణ ఎన్నికల ఫలితాలతో తీవ్ర ఆవేదన చెందారని తెలిపారు. తెలంగాణ ప్రజల నిర్ణయం దేశ రైతాంగాన్ని నిరుత్సాహ పరిచిందని పేర్కొన్నారు. ప్రతిరోజూ మాదిరిగా గురువారం నాడు కూడా తమ అభిమాన నేత కెసిఆర్‌ను కలిసేందుకు ఎర్రవెల్లి నివాసానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ నర్సాపూర్ ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల నుండి తనను కలిసేందుకు వచ్చిన వారితో కెసిఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి కెసిఆర్ ప్రసంగించారు.



**ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయం**

ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయమని కెసిఆర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు అని... ప్రతిపక్ష పాత్ర కూడా శాశ్వతం కాదని వ్యాఖ్యానించారు. మనకు ప్రజా తీర్పే శిరోధార్యం అని, వారు ఎటువంటి పాత్రను అప్పగిస్తే దానిని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని కార్యకర్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయామని బాధపడడం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదని, ప్రజాసంక్షేమం కోసం కొనసాగే నిరంతర ప్రక్రియనే రాజకీయం అని పేర్కొన్నారు. ప్రజల్లో కలిసివుంటూ వారి సమస్యల మీద నిరంతరం పోరాడుతూ వారి అభిమానాన్ని సాధించాలని కెసిఆర్ పునరుద్ఘటించారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ సంపూర్ణ అభివృద్ధి సాధించడమే బిఆర్ఎస్ అంతిమలక్ష్యమని స్పష్టం చేశారు. కార్యకర్తలు ఏమాత్రం అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. గెలుపోటములకు అతీతంగా నిరంతర కృషి కొనసాగించడమే మన కర్తవ్యమని కార్యకర్తలకు అధినేత పిలుపునిచ్చారు.

# మాయదారి నీళ్ల బావి...

## ఒకరి తర్వాత ఒకరుగా ఐదుగురిని వరుసగా మింగేసింది!

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్‌లో దారుణం చోటు చేసుకుంది. బావిలో విషవాయువు పీల్చి ఒకరి తర్వాత ఒకరుగా ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓ తండ్రి, అతని ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. ఈ విషాద సంఘటన ఛత్తీస్‌గఢ్‌లోని చంపా జిల్లా కికిర్దా గ్రామంలో శుక్రవారం (జులై 5) ఉదయం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బిలాస్‌పూర్ రేంజ్) సంజీవ్ శుక్లా తెలిపిన వివరాల ప్రకారం. చంపా జిల్లా బిర్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని కికిర్దా గ్రామానికి చెందిన రామచంద్ర జైశ్వాల్ (60) అనే వ్యక్తి తన ఇంటి పెరట్లోని బావిలో పడిపోయిన చెక్క ముక్క కోసం దాదాపు 30 అడుగుల లోతైన బావిలోకి దిగాడు. అయితే అతను ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అతడి భార్య గొళ్లుగొళ్లున ఏడుస్తూ ఇరుగు పొరుగు సాయం కోరింది. దీంతో జైశ్వాల్‌ను రక్షించేందుకు రమేశ్ పటేల్ (50), అతని ఇద్దరు కుమారులు రాజేంద్ర పటేల్ (20), జితేంద్ర పటేల్ (25) ముగ్గురూ ఒకరితర్వాత ఒకరు బావిలోకి దిగారు. అయితే ఈ ముగ్గురూ కూడా తిరిగి పైకి రాలేదు. ఆ తర్వాత చంద్ర (25) అనే మరో వ్యక్తి కూడా అందులోకి దిగాడు. అతడు కూడా బయటకు రాలేదు. దీంతో భయాందోళనలకు గురైన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు బావిలోని విషవాయువు పీల్చి వారంతా చనిపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం బావిలోంచి ఐదుగురి మృతదేహాలను స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ వెలికి తీయగా.. పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోస్టుమార్టం అనంతరం వీరి మరణానికి అసలు కారణం



తెలుస్తుందని న్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సంజీవ్ శుక్లా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తునట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ సాయి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కక్కరికి రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# తొలి దేశీయ స్మార్ట్ టివి ఆపరేటింగ్ సిస్టంను టెస్ట్ చేస్తున్న రిలయన్స్!

హైదరాబాద్: రిలయన్స్ ఇండస్ట్రీస్ దీపావళి నాటికి టెలివిజన్‌లను వాణిజ్యపరంగా ప్రారంభించడం కోసం... దేశంలో మొట్టమొదటి దేశీయంగా అభివృద్ధి చేసిన స్మార్ట్ టెలివిజన్ ఆపరేటింగ్ సిస్టమ్‌ని పరీక్షించడం ప్రారంభించిందని ఇద్దరు పరిశ్రమ అధికారులు తెలిపారు. గూగుల్ ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫారమ్‌పై ఆధారపడిన జియో టివి ఓఎస్, సామ్సంగ్ టైజెన్ ఓఎస్, ఎల్జీ వెబ్‌ఓఎస్, స్కైవర్త్ కూలిటా ఓఎస్, హిసెన్స్ గ్రూప్ విడా ఓఎస్ అగ్ర టెలివిజన్ తయారీదారు ఓఎస్ తో పోటీపడుతుంది. రిలయన్స్ తన టివి ఓఎస్‌ని కొన్ని హోమ్ గ్రోన్ టివి తయారీదారులకు ఫీడ్‌బ్యాక్, ఫిక్స్ బగ్‌ల కోసం, బీటా టెస్టింగ్ కోసం అందించిందని ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు.

రిలయన్స్ తన స్వంత జియో ఓఎస్ ని నడుపుతున్న 4K, పూర్తి హై డెఫినిషన్ స్మార్ట్ టెలివిజన్‌లను లాంచ్ చేస్తుంది. ఇతర స్వదేశీ టెలివిజన్ తయారీదారులతో లైసెన్సింగ్ ఒప్పందాలను కుదుర్చుకుంటుంది. రిలయన్స్ బిపిఎల్, రీకనెక్ట్ బ్రాండ్‌ల క్రింద స్మార్ట్ టీవీలను విక్రయిస్తోంది. ఈ మోడల్స్ ఎక్కువగా ఎంట్రీ లెవల్ సెగ్మెంట్‌లో ఉంటాయి.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com